# పల్లె వెలుగు

తెలుగు దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

సబ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ పేజీలు : 8 సంపుటి : 13 - సంచిక 177 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ శుక్రవారం 08- 11 - 2024 వెల-2


కాలిఫోర్నియాలో కార్చిచ్చు..
భయాందోళనలలో ప్రజలు..









## తాళ్లాయపాలెంలో గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్ స్టేషన్ ప్రారంభించిన సీఎం

### రూ.505 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్
### 400-220 కేవీ సామర్థ్యంతో సబ్ స్టేషన్ నిర్మాణం
### ఇక్కడ్నించే మరో ఐదు సబ్ స్టేషన్లను కూడా ప్రారంభించిన సీఎం

గుంటూరు పల్లె వెలుగు న్యూస్

ఏపీ సీఎం చంద్రబాబు నేడు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. ఇది 400/220 కేవీ సబ్ స్టేషన్. దీన్ని రూ.505 కోట్ల వ్యయంతో నిర్మించారు.

నేడు తాళ్లాయపాలెం విచ్చేసిన సీఎం చంద్రబాబు... ఈ సరికొత్త సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. ఇక్కడ్నించే మరో ఐదు సబ్ స్టేషన్లను కూడా చంద్రబాబు వర్చువల్ గా ప్రారంభించారు. ఈ ఐదు సబ్ స్టేషన్లను రూ.702 కోట్లతో నిర్మించారు.

-మిగతా2లో

## వాలంటీర్లను వైసీపీ మోసం చేసింది...

### ఆ జీవోలో వాళ్ల ప్రస్తావనే లేదు: పవన్ కల్యాణ్

సర్పంచ్ సంఘాల సమావేశంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

వాలంటీర్ల అంశంలో సాంకేతిక సమస్య వస్తోందని వెల్లడి

మేం ఆదుకుందాం అనుకున్నా జీవోలో వాళ్ల లేరు అంటూ క్లారిటీ



గత ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో వాలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాము అధికారంలోకి వస్తే వాలంటీర్లను కొనసాగిస్తామని కూటమి చెప్పినప్పటికీ, సాంకేతిక అంశాలు ఆటంకంగా మారాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెబుతున్నారు. ఇవాళ సర్పంచ్ సంఘాల సమావేశానికి పవన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాలంటీర్లను వైసీపీ దారుణంగా మోసం చేసి నియమించుకుందని ఆరోపించారు. వాలంటీర్లకు ఇచ్చిన మాట నెరవేర్చుదామని భావిస్తుంటే, గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలో ఎక్కడా వాలంటీర్ల ప్రస్తావనే లేదని పవన్ స్పష్టం చేశారు. అసలు, దాంట్లో వాలంటీరు ఉద్యోగాలే లేవని అన్నారు. ఇదొక సాంకేతిక సమస్యగా మారిందని విచారం వ్యక్తం చేశారు.

"గ్రామ వాలంటీర్లు, సచివాలయాలు పంచాయతీలకు సమాంతర వ్యవస్థలా తయారయ్యాయన్న అభిప్రాయం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంతా ముక్తకంఠంతో చెబుతున్నారు. వాలంటీర్ వ్యవస్థ వేరు. సచివాలయ వ్యవస్థ వేరు. వాలంటీర్లకు మేలు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. జీతాలు పెంచుదామంటే జీవోలో ఎక్కడా కనబడడం లేదు. గత ప్రభుత్వం వారిని మోసం చేసింది. వాళ్లు ఉద్యోగంలో ఉన్నట్లు రికార్డులు ఉంటే ఆ వ్యవస్థను రద్దు చేయవచ్చు. కానీ వాళ్లు అసలు వ్యవస్థలోనే లేరు. ఇదో సాంకేతిక సమస్య" అని వివరించారు.

గత ఎన్నికల సమయంలో కూటమి... వాలంటీర్ల వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని, తాము అధికారంలోకి వస్తే వాలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని కూడా హామీ ఇచ్చింది. అదే సమయంలో... పెద్ద సంఖ్యలో వాలంటీర్లు రాజీనామాలు చేశారు. వైసీపీ నేతల ఒత్తిళ్ల కారణంగానే వారు రాజీనామాలు చేసినట్టు కథనాలు వచ్చాయి.

## నా ఇంటి పేరు మార్చి రాక్షసానందం పొందారు: షర్మిల



సోషల్ మీడియా పోస్టులపై షర్మిల స్పందన

సామాజిక మాధ్యమాలు సమాజానికి మేలు చేసేలా ఉండాలని వెల్లడి

సైకోలు సోషల్ మీడియాను భ్రష్టుపట్టించారని విమర్శలు

తల్లి, చెల్లి అనే ఇంగితజ్ఞానం లేకుండా పోస్టులు పెట్టారని ఆగ్రహం

2లో

## మూసీ ప్రక్షాళనపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

మూసీ ప్రక్షాళన జరగాలి... హైదరాబాద్‌కు నీరు ఇవ్వాలన్న కేంద్రమంత్రి

మూసీ నదికి రిటైనింగ్ వాల్ కట్టాలన్న కిషన్ రెడ్డి

కానీ ఇళ్లను కూల్చివేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక

కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టీకరణ



హైదరాబాద్ పల్లె వెలుగు న్యూస్ 2లో

మూసీ ప్రక్షాళనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రక్షాళన జరగాల్సిందేనని... హైదరాబాద్ కు నీరు ఇవ్వాల్సిందేనని అన్నారు. ఈరోజు ఆయన

## మాజీ మంత్రి మల్లారెడ్డికి ఈడీ షాక్.

### మెడికల్ సీట్ల అక్రమాలపై నోటీసులు



పీజీ మెడికల్ సీట్లను అక్రమంగా విక్రయించారనే అభియోగాలు

విచారణకు హాజరు కావాలని మల్లారెడ్డి కాలేజీకి నోటీసులు

విచారణకు హాజరైన కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

తెలంగాణ పల్లె వెలుగు న్యూస్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ షాకిచ్చింది. పీజీ మెడికల్ సీట్లను అక్రమంగా విక్రయించారనే అభియోగాలపై గురువారం ఈ నోటీసులు ఇచ్చింది. విచారణకు హాజరు కావాలని ఈడీ నోటీసుల్లో పేర్కొంది. దీంతో, మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి అధికారుల ఎదుట హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మల్లారెడ్డి ఇంట్లో సోదాలు జరిగిన విషయం తెలిసిందే. తెలంగాణ లో పలు మెడికల్ కాలేజీలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను విక్రయించారంటూ

-మిగతా2లో

## రాజీ కుదిరిందని కేసు కొట్టేస్తారా..

### లైంగిక వేధింపుల కేసులో సుప్రీంకోర్టు సీరియస్

రాజస్థాన్ హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన అత్యున్నత న్యాయస్థానం

ఎఫ్ఐఆర్ కొట్టేయడం సరికాదని వ్యాఖ్య

పోక్సో, అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదైందని గుర్తుచేసిన వైనం

2లో




## సోదాల పేరుతో మహిళలు ఉన్న గదుల్లోకి వెళ్లడం తప్పు: ప్రియాంక గాంధీ



ఎన్నికల నేపథ్యంలో పాలక్కాడ్ హోటల్లో ఉంటున్న మహిళా కాంగ్రెస్ నేతలు

హోటల్‌లోకి బ్యాగుతో వెళ్లిన కార్యకర్త... సల్లధనంగా అనుమానం

హోటల్ గదిలోకి వెళ్లి సోదాలు నిర్వహించిన పోలీసులు

2లో

## సిటీలో మరో 50 మందికి హైడ్రా నోటీసులు



ప్రభుత్వ స్థలాల కబ్జాపై సీరియస్

15 రోజుల్లోగా ఖాళీ చేయాలని వార్నింగ్

ఆ తర్వాత కూల్చివేతలు చేపడతామని వెల్లడి

2లో

హైదరాబాద్ పల్లె వెలుగు న్యూస్

ప్రభుత్వ స్థలాలు, పబ్లిక్ పార్కులతో పాటు లే అవుట్ లలో పార్కుల కోసం వదిలిన స్థలాలను ఆక్రమించడంపై హైడ్రా సీరియస్ గా స్పందించింది. తాజాగా మరో 50 మందికి నోటీసులు జారీ చేసింది.

## ఉత్పత్తి రంగం అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం..



అమరావతి పల్లె వెలుగు న్యూస్

అమరావతిలోని విట్ యూనివర్శిటీలో ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ జరిగింది. ముఖ్య అతి థిగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొని ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ..

2లో

# మూసీ ప్రక్షాళనపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. మూసీ నదికి కృష్ణా, గోదావరి నది నీటిని తీసుకువచ్చినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

మూసీ నదికి రిటైనింగ్ వాల్ కట్టాలని, నగరంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కానీ మూసీ పరీవాహక ప్రాంతంలో ఒక్క ఇంటిని కూల్చినా తాము ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇళ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తామంటే ఎలా? అని ప్రశ్నించారు.

మూసీ పరీవాహక ప్రాంతంలో ఉండేందుకు తాము సిద్ధమన్నారు. అక్కడే బస చేస్తాం... అక్కడే ఓరోజు నిద్ర చేస్తాం... అక్కడే తింటామని కిషన్ రెడ్డి అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో రేవంత్ రెడ్డి పర్యటించడాన్ని ఆయన స్వాగతించారు. కులగణనకు కూడా తాము వ్యతిరేకం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తన డీఎన్ఏ ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసని... ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు. గెలుపు కోణంలోనే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బీజేపీ బృందాలు పర్యటిస్తాయన్నారు. బీజేపీ లేకుండా తెలంగాణలో రాజకీయాలు లేవని వ్యాఖ్యానించారు. ఫ్లైఓవర్లు, ఇతర అంశాలపై త్వరలో సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాస్తానన్నారు.

## సోదాల పేరుతో మహిళలు ఉన్న గదుల్లోకి వెళ్లడం తప్పు: ప్రియాంక గాంధీ

సోదాల పేరుతో పార్టీకి చెందిన మహిళా నేతలు ఉన్న గదుల్లోకి పోలీసులు ప్రవేశించడం సరికాదని ఏఐసీసీ అగ్రనాయకురాలు, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రియాంక గాంధీ అన్నారు. కేరళలోని వయనాడ్, పాలక్కాడ్ నియోజకవర్గాల్లో మరికొన్ని రోజుల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. దీంతో పలువురు కాంగ్రెస్ మహిళా నేతలు పాలక్కాడ్‌లో ఉంటున్నారు. ఓ కాంగ్రెస్ కార్యకర్త బ్యాగ్‌తో లోనికి వెళ్లారు.

ఇది సీసీటీవీలో రికార్డ్ అయింది. నల్లధనాన్ని తీసుకువెళుతున్నారనే అనుమానాలు వచ్చాయి. దీంతో ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ కేరళ ప్రభుత్వం పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో పోలీసులు హోటల్‌కు వెళ్లి... సోదాలు నిర్వహించారు.

ఈ ఘటనపై ప్రియాంక గాంధీ స్పందించారు. సోదాల పేరుతో అర్ధరాత్రి సమయంలో మహిళలు ఉన్న గదుల్లోకి పోలీసులు వెళ్లడం తప్పు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. మరోవైపు, హోటల్ నుంచి నల్లధనం తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని బీజేపీ ఆరోపణలు గుప్పిస్తోంది.

## సిటీలో మరో 50 మందికి హైడ్రా నోటీసులు

పదిహేను రోజుల్లోగా ఆక్రమించిన స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించింది.

లేదంటే కూల్చివేతలు చేపడతామని నోటీసుల్లో హెచ్చరించింది. వారం కిందట నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో మన్సూరాబాద్ లో రోడ్డును ఆక్రమించి కట్టిన ఇంటిలో ఓ రూమ్ ను అధికారులు కూల్చివేశారు. ఈ నెలాఖరకు మరికొన్ని ఆక్రమణలను కూల్చివేసేందుకు హైడ్రా అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలకు సంబంధించి ఫుల్ టాంక్ లెవల్ (ఎఫ్ టీఎల్), బఫర్ జోన్ల బౌండరీలను నిర్ధారించే పనిలో హైడ్రా అధికారులు తలమునకలుగా ఉన్నారు. అదే సమయంలో ఆక్రమణదారులపైనా దృష్టి సారించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమణదారుల నుంచి కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వారం రోజులుగా కబ్జాదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. రోడ్ల పక్క ప్రభుత్వ స్థలాలు, ఫుట్ పాత్ లు, పార్కు స్థలాలను ఆక్రమించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు.

## సర్వమతాల సారం ఒక్కటే..

నారాయణపేటరూరల్, పల్లె వెలుగు న్యూస్ సర్వమతాల సారం ఒక్కటేనని.. మానవులంతా సమానమేనని.. అందరూ కలిసికట్టుగా ఉండి శాంతి, సమానతలను పాటించాలని వక్తలు అన్నారు. గురువారం మండలంలోని కొల్లంపల్లి ఖతాల్ హుసేనీ దర్గాలో 550వ ఉర్సులో భాగంగా 24వ సర్వధర్మ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తారీఖ్అన్సారీ, వివిధ మతాల పీఠాధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తారీఖ్అన్సారీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ శాంతి, సమానతలను పాటిస్తూ కలిసికట్టుగా ఉండాలన్నారు. అన్ని మతాలకు చెందిన గ్రంథాల్లో అందరూ సమానమేనని చెప్పడం జరిగిందన్నారు. పీఠాధిపతులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ శాంతి, సమానతలను పాటిస్తూ దైవ చింతనలో మెలగాలన్నారు. సర్వజనులు సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. శాంతి మార్గంలోనే భక్తి ఏర్పడుతుందని ఈ భక్తితో ప్రతి ఒక్కరిలో భగవంతుడిని చూడాలన్నారు. ఐకమత్యంతోనే దేశాన్ని రక్షించుకోవాలన్నారు. పేట జిల్లాలోని కొల్లంపల్లి దర్గాలో సర్వమతాలను ఐక్యం చేసేందుకు గాను సర్వధర్మ సమ్మేళనం నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ జలాల్‌హుసేనీ, పేట మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు నాగురావు నామాజీ, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, నాయకులు నందునామాజీ, సలీం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జనార్దన్‌గౌడ్, వివిధ మతాల పీఠాధిపతులు, అష్రఫియా ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



## కాలిఫోర్నియాలో కార్చిచ్చు.. భయాందోళనలలో ప్రజలు..

**పెనుగాలులతో వేగంగా విస్తరిస్తున్న మంటలు**

**వేలాది మందిని తరలిస్తున్న అధికారులు**

**హెలికాప్టర్లతో మంటలు ఆర్పుతున్న సిబ్బంది**

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం లాస్ఏంజెలిస్ సమీపంలో కార్చిచ్చు రేగింది. అక్కడి కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. పెనుగాలుల కారణంగా చుట్టుపక్కల ప్రాంతాలకు వేగంగా విస్తరిస్తున్నాయి. తొలుత కిలోమీటరు విస్తీర్ణంలో మొదలైన కార్చిచ్చు.. భారీ గాలుల కారణంగా గంటల వ్యవధిలోనే ఏకంగా 62 కిలోమీటర్లకు వ్యాపించింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో దట్టమైన పొగ అలముకుంది. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మంటలు విస్తరించే అవకాశం ఉన్న ప్రాంతాలలోని వేలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పలు ఇళ్లు మంటల్లో చిక్కుకున్న దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

లాస్ఏంజెలిస్ చుట్టుపక్కల మూడువేలకు పైగా నివాస ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మంటలు, పెనుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో చాలామంది ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. ఓవైపు కార్చిచ్చు, మరోవైపు విద్యుత్ లేక జనం ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పలువురు స్వచ్ఛందంగా ఇల్లు, వాకిలి విడిచి దూరంగా వెళ్లిపోతున్నారు. మరోవైపు, మంటలను నియంత్రించేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. హెలికాప్టర్లతో నీటిని కుమ్మరిస్తూ మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

# భావజాలాన్ని ఎన్‌కౌంటర్ చేయలేరు!




నరేంద్ర మోదీ, అమిత్ షాలు వామపక్ష పార్టీలను ప్రధాన బద్ధశత్రువుగా చూస్తున్నారు. వామపక్ష భావాలు కలిగిన వారిపై ఊపా, రాజద్రోహం కేసులు పెడుతూ బెయిల్ రాకుండా సంవత్సరాల తరబడి జైళ్ళల్లోనే మగ్గేట్టు చేస్తున్నారు. గొంతెత్తి మాట్లాడే వారి గొంతులను అక్రమ అరెస్టులతో నొక్కుతున్నారు. అర్బన్ నక్సలైట్‌లు అని ముద్రవేస్తున్నారు. ఇప్పుడు మావోయిస్టు ఏరివేత లక్ష్యంగా వందలాది మంది మావోయిస్టులను బలికొన్నారు. వచ్చే ఏడాదికి నక్సలైట్‌లను నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు ఇస్తున్నారు. దీనికి కారణం భారతదేశంలో వామపక్ష పార్టీలు లేకుండా చేయాలన్న దుర్బుద్ధి తప్ప మరొకటి కాదు. మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ ప్రజల మధ్యన చిచ్చుపెట్టే ఆరెస్సెస్ ఆడిస్తున్న నాటకంలో బీజేపీ పాత్ర వహిస్తున్నది.

కమ్యూనిస్టులు వామపక్ష పోరాటాల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పద్ధతులలో హక్కులను పొందాలని ప్రయత్నిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలలో రకరకాల ఆలోచనలు ఉన్నాయి. మావోయిస్టులు తుపాకి గొట్టం ద్వారానే మన హక్కులను సాధించుకుంటామనే ఆలోచనతో పోరాటం చేస్తున్నారు. వారు చేస్తున్న పోరాటం తప్పు కావచ్చు. కానీ భార్యాపిల్లలను వదలి ప్రాణాలకు తెగించి ఎప్పుడు ఎక్కడ తింటారో, నిద్రిస్తారో తెలియని అగమ్యగోచర పరిస్థితులలో సమాజ శ్రేయస్సు కోసమే వారు పోరాడుతున్నారు. దోపిడి వర్గాల అణచివేతలను అరికట్టాలన్న లక్ష్యంతో వారు ఆ పంథాను ఎంచుకున్నారు.

పార్లమెంట్ పంథాలో పనిచేస్తున్న వామపక్షాలు కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ఎన్నికలు ఐదేళ్ళకు ఒకసారి జరుగుతాయి. ఆ ఎన్నికలతో దేశ ప్రజల జీవన ప్రమాణాలలో మార్పులు రావాలి. కానీ ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓట్ల కోసం నాయకులు అడ్డమైన దారులు తొక్కుతూ డబ్బు, మద్యం, సంక్షేమ పథకాల ఎర చూపి ఓటర్లకు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాసేవకులు కనుమరుగై, హంతకులు, గూండాలు, కార్పొరేట్ సంస్థల అధిపతుల నుంచి రియలెస్టేట్ వ్యాపారుల వరకు ఎంపీలూ ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారు. ప్రజలు గెలవాల్సిన ప్రజాస్వామ్యంలో దోపిడి శక్తులూ, వారికి అండగా నిలిచే మతోన్మాద శక్తులూ గెలిచి అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నాయి. కార్మిక వర్గాలు, బడుగు బలహీన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయి. ఎక్కడ అణచివేత, దోపిడీ ఉంటుందో అక్కడ వామపక్ష పార్టీలు ఉంటాయి.

ఉగ్రవాద చర్యలను సామాజిక, ఆర్థిక అంశంగా గుర్తించి పరిష్కరించే బదులుగా శాంతిభద్రతల సమస్యగా పరిగణించి ఎన్‌కౌంటర్‌లే ప్రధానమని గతంలో భావించారు. ఇప్పటికీ మోదీ ప్రభుత్వం ఇదే ధోరణిని అవలంబిస్తూ ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామంటున్నారు. మావోయిస్టు ఉద్యమం తాత్కాలికంగా అణచివేయబడినప్పటికీ అంతరాలు లేని, దోపిడీ రహిత సమాజం ఏర్పడే వరకు దాని ఉనికి ప్రభావం అలా ఉంటూనే ఉంటుంది.

వామపక్ష తీవ్రవాదానికి ప్రజల పునాది ఉన్నదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. అలాగే ప్రజలు కూడా ప్రజాస్వామ్య ఫలాలు పొందడానికి చైతన్యవంతం కావాలి. పాలకులను ఆలోచింపచేసే విధంగా ప్రజా చైతన్యాన్ని ప్రదర్శించాలి. ఇటీవల ప్రొఫెసర్ సాయిబాబా అకాల మరణం చెందారు. ఇందుకు పాలకులే కారణం. అన్యాయంగా ఊపా కేసులు మోపి 90శాతం కదలలేని స్థితిలో ఉన్న మేధావిని పదేళ్ళు అండా సెల్‌లో బంధించారు. చివరకు కోర్టు నిర్దోషిగా తేల్చింది. హర్యానా ఎన్నికల్లో ఓట్ల కోసం డేరా సచ్చా సౌదా గురువు రాం రహీమ్ సింగ్‌కు బీజేపీ ప్రభుత్వం పెరోల్ ఇచ్చింది. కానీ, ప్రొఫెసర్ సాయిబాబా తల్లి చనిపోయినప్పుడు చూసేందుకు పెరోల్ ఇవ్వలేదు. చివరికి ఆయన నిర్దోషి అని తేలింది. ఏమి లాభం? జైలులో పడిన అష్టకష్టాలతో బైటికి వచ్చిన నెలల్లోనే అనారోగ్యంతో అకాల మృత్యువుకు గురయ్యారు. కేవలం వామపక్ష భావజాలం కలిగి ఉన్నారనే ఒకే ఒక్క కారణంతో ఆయనను బంధించి. మానసికంగా హింసించడమే కాకుండా, చివరికి ఆయన మరణానికి కూడా పాలకులు కారణమయ్యారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పేర్లతో మావోయిస్టుల అంతానికి పంతం పట్టింది. వారి ఉద్దేశం ఛత్తీస్‌గఢ్ ఇతర అటవీ ప్రాంతాలలో ఆదివాసీల అభిమానాన్ని చూరగొన్న మావోయిస్టులను నిర్మూలించి, ఆ పచ్చని అడవిలోని వనరులనూ, గనులనూ తమ వందిమాగధ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే అన్న మాట ప్రచారంలో ఉంది.

ఇలాంటి తరుణంలో మావోయిస్టులు కూడా అంతర్మథనం చేసుకుంటూ ప్రత్యామ్నాయ ఆలోచనలకు పదును పెట్టాలి. ప్రజాస్వామ్య పద్ధతులలోనే ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను తిప్పికొట్టాలి. చావుకు చావు అనే సిద్ధాంతం నుండి వైదొలగి కమ్యూనిస్టులతో కలిసి ఐక్యపోరాటం చేసి వర్గరహిత సమాజాన్ని నిర్మించాలి.

వివిధ పార్టీలుగా చీలిపోయిన కమ్యూనిస్టులు, మావోయిస్టులు, ఇతర వామపక్ష శక్తుల మధ్య అనుసరించే మార్గంపై భిన్నాభిప్రాయాలు వుండవచ్చే తప్పా సమసమాజ స్థాపనే అందరి అంతిమ లక్ష్యం. మితవాద, మతవాద శక్తుల నుంచి దేశం తీవ్ర ప్రమాదం ఎదుర్కొంటున్న ఈ దశలో వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా దానిని తిప్పికొట్టాలి.

## 370 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తాళ్లూరు, నవంబరు పల్లె వెలుగు న్యూస్

అక్రమంగా తరలి స్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ కులశేఖర్ ఆదేశాను సారం సీఐ ఎన్.రాఘవరావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరా త్రి బొద్దికూరపాడు-రాజంపల్లి మార్గంలో వెళుతున్న లారీని తనిఖీ చేయగా 370 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

అందిన సమాచారం మేరకు.. బొద్దికూరపాడు కేంద్రంగా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం సాగిస్తున్నారు.

ఆగ్రామంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా లారీలో తరలిస్తున్నారు. గ్రామస్థుల సమాచారంతో విజిలెన్స్ అధికారులు చింతపాలెం సమీపంలో లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో కొన్ని రేషన్ బియ్యం బస్తాలు, మరికొన్ని తెల్లగోతాల్లో ఉంచి ధాన్యంలా నమ్మించేందుకు యత్నించారు. వాటిని లెక్కించగా 50 కేజీలకు చెందిన 370 బస్తాల్లో (18వేల400 కెజీల) రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధాంచారు.

లారీ డ్రైవర్ షేక్ ఇస్మాయిల్, లారీ యజమాని ౄరఆర్.లక్ష్మీనారాయణలను విచారించారు.

తూర్పుగంగవరంగ్రామానికి చెందిన గుజ్జుల సుబ్బారెడ్డి(డీఆర్), బొద్దికూరపాడు గ్రామానికిచెందిన పులి సుబ్బారెడ్డి అక్రమ మార్గంలో బియ్యాన్ని తరలిస్తున్నారు.

మండలంలోని గ్రామాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని బొద్దికూరపాడులో లోడు చేసుకొని తరలిస్తు న్నట్టు విజిలెన్స్ అధికారుల విచారణలో తెలిపారు. పట్టుబడ్డ రేషన్ బియ్యం వాహనాన్ని తాళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం చీమకుర్తి ఎంఎస్ఎస్ పాయింట్‌కు తరలించారు.

## తాళ్లాయపాలెంలో గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్ స్టేషన్ ప్రారంభించిన సీఎం

ఇక, రూ.4,665 కోట్లతో చేపట్టనున్న 14 ట్రాన్స్ కో పనులకు కూడా చంద్రబాబు నేడు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొన్నారు.

## నా ఇంటి పేరు మార్చి రాక్షసానందం పొందారు: షర్మిల

ఏపీ అధికార టీడీపీ కూటమి, వైసీపీ మధ్య సోషల్ మీడియా పోస్టులపై తీవ్రస్థాయిలో మాటల యుద్ధం నడుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా ఈ అంశంపై స్పందించారు. సోషల్ మీడియా ఎల్లప్పుడూ సమాజానికి మేలు చేసేలా ఉండాలని అభిలషించారు. కానీ, కొందరు సైకోలు సైకో పార్టీలతో కలిసి సోషల్ మీడియాను భ్రష్టుపట్టించారని తెలిపారు.

మానవ సంబంధాలు, రక్తసంబంధాలు మరిచి మృగాల్లా మారారని... తల్లి, చెల్లి అనే ఇంగితజ్ఞానం లేకుండా షర్మిల మండిపడ్డారు. ప్రశ్నించే మహిళలపై అసభ్యకర పోస్టులతో రాక్షసానందం పొందారని విమర్శించారు.

"సోషల్ మీడియా సైకోల బాధితుల్లో నేను కూడా ఉన్నాను. అసభ్యకర పోస్టులతో పరువుప్రతిష్ఠలు దెబ్బతీసేలా వ్యవహరించారు. దారుణమైన పోస్టులతో పైశాచిక ఆనందం పొందే సైకోలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నాపై, నా తల్లిపై, నా సోదరి సునీతపై విచ్చలవిడిగా పోస్టులు పెట్టారు. నేను వైఎస్ రాజశేఖర్ రెడ్డికే పుట్టలేదని దారుణాతిదారుణంగా అవమానించారు. నా ఇంటి పేరు కూడా మార్చి రాక్షసానందం పొందారు.

నాపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్ రెడ్డిపై నేను కేసు పెట్టాను. సైకోలా పోస్టులు పెట్టిన వర్రా రవీందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం. దారుణమైన పోస్టులు పెట్టేవారు ఏ పార్టీలో ఉన్నా వారి అంతు చూడాలి" అంటూ షర్మిల పేర్కొన్నారు.

## రాజీ కుదిరిందని కేసు కొట్టేస్తారా..

లైంగిక వేధింపుల కేసులో రాజీ కుదిరిందనే కారణంతో కేసు కొట్టేయడం సబబు కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈమేరకు లైంగిక వేధింపుల కేసులో ఓ టీచర్ పై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలంటూ రాజస్థాన్ హైకోర్టు వెలువరించిన తీర్పును పక్కన పెట్టింది. సదరు టీచర్ ను ప్రాసిక్యూట్ చేయాలని పోలీసులను ఆదేశించింది.

**కేసు ఏంటంటే..**

2022లో రాజస్థాన్ లోని గంగాపూర్ సిటీలో ఓ దళిత బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విమల్ కుమార్ గుప్తా అనే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో విమల్ కుమార్ గుప్తాపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాల మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. కేసు విచారణ జరుగుతుండగా విమల్ కుమార్ గుప్తా బాధిత కుటుంబంతో రాజీ కుదుర్చుకున్నాడు.

అపోహతో, మిస్ అండర్ స్టాండింగ్ వల్ల తాము కేసు పెట్టామని, టీచర్ గుప్తాపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని తాము కోరుకోవడంలేదంటూ బాలిక తల్లిదండ్రులతో ఓ స్టాంప్ పేపర్ రాయించుకున్నాడు. ఈ పేపర్ ను పోలీసులకు సమర్పించగా.. వారు కోర్టులో ఫైల్ చేశారు. అయితే, కోర్టు ఈ స్టాంప్ పేపర్ ను ఆమోదించలేదు. దీంతో గుప్తా రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించాడు. కేసు విచారించిన హైకోర్టు.. స్టాంప్ పేపర్ ను పరిశీలించి, బాలిక తల్లిదండ్రుల వాంగ్మూలం తీసుకున్నాక కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. గుప్తాపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలంటూ పోలీసులను ఆదేశించింది.

**సుప్రీంకోర్టులో సోషల్ వర్కర్ పిటిషన్**

రాజస్థాన్ హైకోర్టు తీర్పుపై సోషల్ వర్కర్ రాంజీ లాల్ భైర్వా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుప్తాపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేయడాన్ని సవాల్ చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. లైంగిక వేధింపుల కేసులో రాజీకి అవకాశం లేదని పేర్కొంది. పైగా ఈ కేసులో పోక్సో చట్టం, అట్రాసిటీ యాక్ట్ ఇంక్లూడ్ అయి ఉన్నాయని గుర్తు చేసింది. టీచర్ విమల్ కుమార్ గుప్తాపై ఎఫ్ఐఆర్ పునరుద్ధరించి, ఆయనను ప్రాసిక్యూట్ చేయాలని పోలీసులను ఆదేశించింది.

## ఉత్పత్తి రంగం అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం..

**ఉన్నత విద్యకోసంనేనుకూడావిదేశాలకు వెళ్లివచ్చాను..**

మనకు, విదేశాలకు ఉన్నత విద్యలో తేడాలున్నాయని అన్నారు. అక్కడ పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు ఉండరు.. విద్యార్థులపై అలాంటి నమ్మకం ఉంటుందని పేర్కొన్నారు. మన తెలుగు వారు అంతర్జాతీయ కంపెనీల్లో అగ్రస్థానంలో ఉన్నారు.

సీఎం చంద్రబాబు నాయుడు హైదరాబాద్ లో ఐటీ రంగం వృద్ధికి తీసుకున్న చర్యలతో మన పిల్లలు అద్భుతంగా రాణిస్తున్నారు.. వారంతా విదేశాల్లో ఇప్పుడు మంచి స్థానాల్లో ఉన్నారని లోకేశ్ అన్నారు. గెలవడం కోసం నిలబడాలి అన్న మాటను విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలి.. అంతర్జాతీయ పరిణామాల గురించి అవగాహనతో ఉండాలని విద్యార్థులకు లోకేశ్ సూచించారు. ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగేందుకు అవకాశం ఉందని అన్నారు. 1985 తరువాత మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధించలేదు. 2019లో నేను కూడా పోటీ చేసి 5300 కోట్ల తేడాతో ఓడిపోయా.. కానీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి ప్రజల అభిమానం పొంది అత్యధిక మెజార్టీతో గెలిచా. గెలుపుకోసం నా మార్గాన్ని నేను వేసుకున్నానని లోకేశ్ అన్నారు.

ప్రపంచంలో చాలా అవకాశాలు ఉన్నాయి. యువత కూడా పెద్ద పెద్ద ఆలోచనలు చేయాలి. అమరావతి అభివృద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయి. సింగపూర్ మోడల్, చైనా మోడల్ అని మాట్లాడుకున్నట్లే.. ఇండియా మోడల్ గురించి ప్రపంచం మాట్లాడాలి. అందులో ఆంధ్రప్రదేశ్, అమరావతి కీలక పాత్ర పోషించాలనేది మా లక్ష్యం అని లోకేశ్ అన్నారు. ఒక్క రాజధాని ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మా ప్రగాఢ విశ్వాసం. ఉత్పత్తి రంగాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నాం. ఫలితాలు వస్తున్నాయి. చాలా పెద్ద సంస్థలు ఏపీకి వస్తున్నాయని లోకేశ్ పేర్కొన్నారు. ఉత్పత్తి రంగం అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం.. చాలా పెద్ద సంస్థలు ఏపీకి వస్తున్నాయి : మంత్రి నారా లోకేశ్

సింగపూర్ మోడల్, చైనా మోడల్ అని మాట్లాడుకున్నట్లే.. ఇండియా మోడల్ గురించి ప్రపంచం మాట్లాడాలి. అందులో ఆంధ్రప్రదేశ్, అమరావతి కీలక పాత్ర పోషించాలనేది ..

## మాజీ మంత్రి మల్లారెడ్డికి ఈడీ షాక్... మెడికల్ సీట్ల అక్రమాలపై నోటీసులు

గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫిర్యాదులు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. అందులో భాగంగా గత ఏడాది జూన్‌లో మల్లారెడ్డి నివాసం, మెడికల్ కాలేజీలు, కార్యాలయాలలో ఈడీ సోదాలు నిర్వహించింది.

ఇతర మెడికల్ కాలేజీల్లోనూ ఈడీ సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా కీలక దస్త్రాలను, పెన్ డ్రైవ్‌లు, హార్డ్ డిస్క్‌లను ఈడీ స్వాధీనం చేసుకుంది. తెలంగాణలోని 10 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 45 సీట్లను బ్లాక్ చేసి విక్రయించినట్లు ఈడీ గుర్తించింది. ఈ నేపథ్యంలో దీనిపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది.



## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు టీటీడీ మెంబర్ మల్లెల రాజశేఖర్ గౌడ్



**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మరియు నూతనంగా టీటీడీ బోర్డు మెంబర్ గా నియమితులైన మల్లెల రాజశేఖర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో, పలు అభివృద్ధి పనులపై వారు చర్చించారు . నియోజకవర్గ అభివృద్ధి మరియు మైనార్టీ సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , కుమ్మరి శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర , నాగభూషణం రెడ్డి , అడ్వకేట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ క్యాన్సర్ అవగాహన దినం

### డాక్టర్ మొహతాబ్ ఆధ్వర్యంలో ర్యాలీ.




**బేతంచెర్ల నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్** బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ గ్రామం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో, జాతీయ కాన్సర్ అవగాహన దినం సందర్భంగా, డాక్టర్ మెహతాబ్ అధ్యర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. 18 ఏండ్ల పైన వున్నవారు క్యాన్సర్ గురించి ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.మత్తుపా నియాలకు దూరంగా ఉండాలి.కాన్సర్ పై విజయం -స్క్రీనింగ్ తో సాధ్యం. ఆరోగ్యవంతమైన ఆహారం తీసికోవాలి.మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలి అని, గురువారం నాడు సిమెంట్ నగర్ గ్రామంలో నినాదాలు ఇస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ప్రజలకు గర్భాశయం, రొమ్ము, నోటి కాన్సర్లపై అవగాహన కల్పించటం జరిగింది.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపెర్వైసర్ రూతమ్మ ఎంఎల్ హెచ్ పిఎస్ సువర్ణ, రాజేశ్వరి ఎఎన్ఎం ఫారిదా భాను, మధువరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఆశాలు రాణి, శాంతమ్మ,పుల్లమ్మ, నూర్జహన్,మాధవి తదితరులు పాల్గొన్నారు




## వధూవరులను ఆశీర్వదించిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

**డోన్. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్** :భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీఎస్ నాగరాజు యాదవ్ కుమార్తె పల్లవి వివాహా కార్యక్రమానికి డోన్ లోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో వివాహా శుభకార్యానికి పాల్గొని వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి వినతిపత్రం అందజేసిన బార్ అసోసియేషన్





**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్** ):నంద్యాల స్థానిక టిడిపి కార్యాలయం (రాజ్ టాకీస్) నందు పత్తికొండ శాసన సభ్యులు కేఈ శ్యామ్ బాబు ఆధ్వర్యంలో పత్తికొండ లో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని కలసి వినతిపత్రం అందసేసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రంగస్వామి. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షులు మరియు టీటీడీ మెంబర్ మల్లెల రాజశేఖర్ గౌడ్ , కుమ్మరి శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర. , న్యాయవాదులు సురేష్ , నాగభూషణం రెడ్డి , నారాయణ , కృష్ణ పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయస్థాయి టైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందన

### టీడీపి నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ

**కర్నూలు పల్లె వెలుగు న్యూస్ బ్యూరో....** బుధవారం ఉదయము టీడీపి మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ నివాసములో టైక్వాండో చిన్నారులు మర్యాద పూర్వకంగా కలిసి పథకాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకతంగా అభినందించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ

మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ మాట్లాడుతూ ఆత్మరక్షణ క్రీడా టైక్వాండో ప్రతి ఒక అమ్మాయి అబ్బాయి సాధన చేయాలని ఇలాంటి పోటీల్లో పాల్గొంటే చదువుతోపాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒక్క విద్యార్థి రోజు సాధన చేయాలని %వా జీ% టైక్వాండో అకాడమీ వారు ఉచితంగా చాలామంది విద్యార్థిని విద్యార్థులను సాధన చేయి స్తున్నారని ఇలాంటి పోటీల్లో పాల్గొంటున్నందుకు చాలా సంతోషంగా ఉందని టైక్వాండోలో బంగారు పతకం సాధించిన విద్యార్థికి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి సి. సందీప్ తరుణ్ బి. మనోజ్ లు ఈనెల 7 నుండి 13 వరకు జరిగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాల్గొంటున్నారు %వా జీ% అకాడమీ వ్యవస్థాపకులు పార్వతమ్మ,మరియు టిడిపి కస్టర్ ఇన్చార్జి కె .జనార్ధన్ ఆచారి, టీడీపి యువ నాయకులు కె.శివ, విద్యార్థులను జాతియస్థాయిలో ఎంపికైనందుకు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

అలాగే అకాడమీ కోచ్ లు సురేంద్ర, ఇబ్రహీంలు



## సింధుజ ను ఘనంగా సన్మానం చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 .పల్లె వెలుగు న్యూస్** ):బెంగళూరు యూనివర్సిటీలో ఒకేసారి 5 గోల్డ్ మెడల్స్ సాధించిన ఘనత, నంద్యాల ఆణిముత్యం సింధుజకే దక్కిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.గురువారం గోల్డ్ మెడల్ సాధించిన సింధుజ కు సన్మానం చేసిన అనంతరం ఎంపీ శబరి మాట్లాడుతూ సివిల్స్ చదివి మన రాష్ట్రానికి, దేశానికీ పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని,

నీకు అన్ని రకాల సహాయ, సహకారాలు తాను అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.నంద్యాల పట్టణానికి చెందిన పసేద్దుల, సింధుజా ఎంఏ చరిత్ర విభాగంలో కర్ణాటక యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ రావడం, “ 5 “ గోల్డ్ మెడల్స్ రావడం నంద్యాల జిల్లా కే గర్వకారణం అన్నారు. ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సింధుజ చదువుల తల్లిగా నిలిచారని కొనియాడారు. నీవు ఇంతకన్నా పై చదువులు చదుకో నేను నీకు అండగా ఉంటా అని ఎంపీ బైరెడ్డి శబరి భరోసా ఇస్తారు. నీకు అన్ని వేళల సహాయం చేస్తానని, నీ ఉన్నత చదువులకి, సివిల్స్ కి నేను సహకరిస్తానని . ఆదర్య పడకుండా ముందుకు సాగాలని బైరెడ్డి శబరి సింధుజకు హామీ ఇచ్చారు.ఈ కాలంలో ఆడపిల్లలకు చదువు ఎందుకు అని చదుకొని ఎవరిని ఉద్దరిస్తుందని, పెళ్లి చేసి అత్తారింటికి పంపే ఈ రోజుల్లో

ఎంతో కష్టపడి తినా తినకనో, రెక్కలు ముక్కలు అయ్యేలా పిల్లలకు చదివిస్తే చాలు అని చెప్పి, చదువులకు ఎంత ఖర్చు అయినా కానీ అని అప్పులు చేసి చదివించి ప్రోత్సహం అందించిన తల్లి భారతి, తండ్రి అరుణ్ కుమార్ లను ఎంపీ శబరి అభినందించారు.

నంద్యాలలలో 10వ తరగతిలో 9.7 ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యి,

శ్రీ చైతన్య కాలేజీ విజయవాడ 2016 లో ఇంటర్మీడియట్ బైపీసీ లో 90% ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించి,

2020, గ్రాడ్యుయేట్ నారాయణ ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్ 9.3.సీజీపీ. బ్యాచిలర్స్ అఫ్ ఆర్ట్స్. తరువాత పోస్ట్ గ్రాడ్యుయేట్ 2023 లో కర్ణాటక యూనివర్సిటీలో 7.77.సీజీపీ ఏ, యూనివర్సిటీ ఫస్ట్ “5” గోల్డ్ మెడల్స్ సింధుజ సాధించి,

బెంగళూరు యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ ,సెంట్రల్



కాలేజీలో గోల్డ్ మెడల్, వినంత కాలేజీలో గోల్డ్ మెడల్, 58 టీహెచ్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ వారికే నరసయ్య గోల్డ్ మెడల్, 58 టీహెచ్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, కే.వీరతప్ప గోల్డ్ మెడల్ వచ్చాయంటే ఆమె నిరంతర శ్రమ, చదువుపై అంకిత భావం, పట్టుదల తెలియజేస్తున్నాయని ఎంపీ శబరి , ప్రముఖ పారిశ్రామిక వేత్త బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి లు అన్నారు.

గోల్డ్ మెడలిస్టు సింధుజ, ఆమె తల్లిదండ్రులు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, సోషల్ మీడియా ప్రతినిధి దక్క శ్రీకాంత్ తదితరులు శాలువా కప్పి, పుష్పగుచ్చం చేతికిచ్చి ఘనంగా సన్మానించారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గోల్డ్ మెడలిస్టు సింధుజకు మిఠాయి తినిపించి, నీవు సివిల్స్ చదవడానికి నేను అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తానని మరోసారి హామీ ఇచ్చారు.

## భగవద్గీత పిరికితనాన్ని తొలగించి సాహస వంతులను చేస్తుంది





**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 ..పల్లె వెలుగు న్యూస్** ):భగవద్గీతను ఆశ్రయిస్తే సకల సంపదలు చేకూరుతాయని, హృదయ దౌర్భల్యం దూరమవుతుందని, స్వామి వివేకానందులను, బాలగంగాధర తిలక్, మహాత్మా గాంధీ వంటి ఎందరో మహనీయులకు స్ఫూర్తినిచ్చిన గ్రంధం అని రామకృష్ణ సేవాశ్రమం నిర్వాహకులు స్వామి అర్చనానంద అన్నారు. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు భగవద్గీత స్వామి వివేకానందునితో పాటు మహాత్ములను ఎలా ప్రభావితం చేసిందో వివరించారు. తదనంతరం విద్యార్థులందరికీ మానవులందరికీ భగవద్గీత పుస్తక ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ పురాణ కాలం నుండి ఆధునిక కాలం వరకు కూడా భగవద్గీతపై అనేక వ్యాఖ్యానాలు పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయని, అటువంటి సద్గ్రంధాన్ని ముఖ్యంగా విద్యార్థి దశలోనే అధ్యయనం చేయాలని, దాని ద్వారా మన జీవిత గమ్యం చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాసులు రెడ్డి, వివేకానంద స్టడీ సర్కిల్ సమన్వయాధికారి మాడుగుల నాగఫని శాస్త్రి, ఎన్.ఎస్.ఎస్.కో-ఆర్డినేటర్ కె.సురేశ్ కుమార్, వివేకానంద రామకృష్ణ భావ ప్రచార సమితి అధ్యక్షులు ప్రముఖ వైద్యులు డాక్టర్ శరశ్చంద్ర, సుధాకరుతో పాటు కళాశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.







## అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందజేసిన రెడ్ క్రాస్



**మహానంది. నవంబర్ 07 .పల్లె వెలుగు న్యూస్** :మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో నవంబర్ 5వ తేదీ రెండు పూరి గుడిసెలు ప్రమాదవశాత్తు కాళీ బూడిద అయ్యాయి. నక్క సుబ్బుడు, నక్క లింగమయ్య వీరి కుటుంబాలు నిరాశ్రయులైనారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ గవర్నర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల సహకారంతో వీరికి మహానంది మండలం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, 2 తార్పాల్ పట్టలు, 2 దుప్పట్లు, నిత్యవసర వస్తువులు మరియు 2 సెట్స్ వంట సామాగ్రి, మహానంది మండల రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ గౌరవ తాహసిల్దారు రమాదేవి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో జోజి బాబు విఅర్ఓ మండల సొసైటీ చైర్మన్ కె. అమర్నాథ్,వైస్ చైర్మన్ పి.కమలాకర్ నాయుడు, ట్రెజరర్ సి. శ్రీనివాసులు మరియు కమిటీ సభ్యులు లాల్ మదర్, మద్దిలేటి,సత్యనారాయణ, మదన శేఖర్, పొన్నపాటి మరియు గ్రామ పెద్దలు మహేశ్వర్ రెడ్డి, రవి అయ్యా ఇతరులు పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్ కు వచ్చే అర్జీలకు స్పష్టమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలి





## దరఖాస్తులు ఏట్ టు వ్యూ ఉండకుండా చూడాలి బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లకుండా దరఖాస్తులు పరిష్కరించాలి జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ

**కర్నూలు పల్లె వెలుగు న్యూస్ బ్యూరో**......ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలకు స్పష్టమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు.

గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్" కు వచ్చే అర్జీలకు సరైన ఎండార్స్మెంట్ ఇచ్చే విధంగా అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా రెవెన్యూ అధికారి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్" కు వచ్చిన దరఖాస్తులను పరిష్కారంలో అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ లో నాణ్యతను పెంచడానికి జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అందుకు దరఖాస్తులకు ఇచ్చే ఎండార్స్మెంట్ ను జిల్లా అధికారులు తప్పనిసరిగా జాగ్రత్తగా చూసి క్లోజ్ చేయాలే తప్ప ఇతర సిబ్బంది వాటిని క్లోజ్ చేయకూడదన్నారు. అర్జీదారుడికి ఇచ్చే ఎండార్స్మెంట్ తప్పనిసరిగా తెలుగులో భాషలో ఉండడంతో పాటు టైప్ ఫార్మాట్ లో ఎండార్స్మెంట్ ఉండాలన్నారు. పిజిఆర్ఎస్ కు వచ్చే దరఖాస్తులో కొన్ని సింపుల్ గా పరిష్కారం చేసేవి ఉంటాయని, కొన్ని ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ ఉండడం జరుగుతుందని అందుకు వచ్చిన అర్జీని ముందుగా చదివి కంటెంట్ పరంగా పరిష్కరించే వాటిని పరిష్కరించాలని లేకపోతే ఈ కారణం వల్ల పరిష్కరించ లేకపోతున్నాము అని సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. రానున్న రోజుల్లో గ్రీవెన్స్ పరిష్కరించే అధికారులకు అందరికీ లాగిన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అధికారులకు వచ్చిన గ్రీవెన్స్ లను 24గం.ల్లో ఓపెన్ చేసి చూడాలన్నారు. ఏట్ టు వ్యూ (%ఎవ్ ‾శీ ఎఱవష%) అనేది ఉండకుండా అలెర్ట్ మెసేజెస్ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా సంబంధిత అర్జీ మీ శాఖకు సంబంధించినది అయితే మీరు సరైన సమయంలో పరిష్కారం చెయ్యాలని లేకపోతే సంబంధిత శాఖకు అర్జీని బదిలీ చేయాలన్నారు. అర్జీ పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో విచారణకు వెళ్ళినప్పుడు సిబ్బంది అర్జీదారుడికి దగ్గరకు వెళ్లి సమస్య తెలుసుకుంటున్న ఫోటో, ఎండార్స్మెంట్ ఇస్తున్న ఫోటోను అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా ఉంటారు కాబట్టి పరిష్కారం అయిన ప్రతి ఒక్క అర్జీని అధికారులే ఆడిట్ చేయాలన్నారు. రీఓపెన్ కేసులు ఎక్కువ శాతం ఉండకుండా జిల్లా అధికారులు ఇచ్చే ఎండార్స్మెంట్ ను ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకొని అప్లోడ్ చేయాలన్నారు.సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి ఇచ్చే ఎండార్స్మెంట్ ఆఖరి క్షణంలో రావడం జరుగుతుందని, అలా కాకుండా అర్జీ పరిష్కారం కోసం 30 రోజుల సమయం ఉంటుంది కాబట్టి 10 రోజులకు ముందే అందుకు సంబంధించిన ఎంక్వైరీ రిపోర్ట్, ఎండార్స్మెంట్ ను డిఆర్ఓ కు అందజేయాలన్నారు. అందుకు అలెర్ట్ కాల్స్ ద్వారా కూడా వారికి గుర్తుచేయడం జరుగుతుందన్నారు. ఆఖరి క్షణంలో ఇచ్చే ఎండార్స్మెంట్ వారు నేరుగా కలెక్టర్ కి అందజేయాలన్నారు.

పిజిఆర్ఎస్ వర్క్ ఫ్లో, గ్రీవెన్స్ నమోదు, గ్రీవెన్స్ ఆడిట్, బియాండ్ ఎస్ఎల్ఎ పై వెళ్లకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించడంతో పాటు పిజిఆర్ఎస్ లో అప్లోడ్ చేసిన తప్పుడు ఎండార్స్మెంట్స్ పై పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం జిల్లా అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు అడిగిన సందేహాలను వారు నివృత్తి చేశారు.

సమావేశంలో పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పిన మోడీపై రైతుల మరో పోరుబాటకు సిద్ధం!

## -రైతు, కార్మిక సంఘాల పిలుపు!!



**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్** ఢిల్లీ రైతుల పోరాటం సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న నరేంద్ర మోడీ మాట తప్పారని మోడీ గారు ఇచ్చిన మాటను ఎలా అమలు చేయించుకోవాలో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం నేర్పిందని ఆ ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా సెంటర్లో జరిగే కార్మిక, కర్షక ర్యాలీలో ప్రజలందరూ పాల్గొ నాలని నంద్యాల పట్టణంలో భగత్ సింగ్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ .రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన రైతు, కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీసభలో సిఐటి జిల్లా కార్యదర్శి ఏ. నాగరాజుగారు ,రాయలసీమ సాగునీటి సాధన కమిటీ అధ్యక్షుడు బొజ్జ దశరథ రామి రెడ్డి , సిఐటియు జిల్లా అధ్యక్షుడు వై యేసు రత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులుడేవిడ్ , నంద్యాల రైతు సంఘం అధ్యక్షులు విజయకుమార్ గారు పిలుపునిచ్చారు. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలకై పార్లమెంట్లో చట్టం చేయాలని, రైతుల పైన ఉన్న అప్పులను రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ నుంచి వ్యవసాయరంగాన్ని మినహాయించాలని ,కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పంటల నష్టపరిహారాలు, పంటల బీమా పథకం కౌలు రైతులందరికీ వర్తింపజేసే అమలు చేయాలని, ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు అమలు చేయాలని జిల్లాలో ఉన్న మెట్ట భూములన్నిటికీ ఎస్సార్ఎంసి, శ్రీశైలం బ్యాక్ వాటర్, వెలుగోడు రిజర్వాయర్ , అలగనూరు రిజర్వాయర్ , హంద్రీనీవాలపై ఎత్తిపోతల పథకాల ద్వారా, కోయి కోయిలకుంట్ల మండలం జులదరాశి, చాగలమర్రి మండలం రాజోలు రిజర్వాయర్లు నిర్మించి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహా కార్యదర్శిటి. వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు ఎం . వీరన్న, శ్రీనివాస్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి ,ఓ ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు టి. మద్దులు, మహమ్మద్ గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



# విద్యుత్ రంగంలో మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులకు నేడు శంకుస్థాపనలు పలు ప్రారంభోత్సవాలు, చేసిన ముఖ్యమంత్రి







## గోరంట్ల మండలం గొల్లపల్లి లో సబ్ స్టేషన్ ను ఆన్ లైన్ లో ప్రారభించిన సీఎం చంద్రబాబు వర్చువల్ కార్యక్రమం కు హాజరైన మంత్రి సవిత

**అనంతపురం చీఫ్ బ్యూరో నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్** శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలంలోని %దీ% గొల్లపల్లి గ్రామంలో 220/132 కె.వి. విద్యుత్ ఉపకేంద్రం, వర్చువల్ కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఈ కార్యక్రమానికి మంత్రి సవితహాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రూ.6 వేల కోట్ల విలువైన విద్యుత్ ప్రాజెక్టు లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారని అదేవిధంగా గోరంట్ల లో 78.98 కోట్ల రూపాయలు తో విద్యుత్ ఉపకేంద్రం ను ప్రజలకు అందుబాటులో కి తెచ్చామని మంత్రి సవిత అన్నారు. ఈ సబ్ స్టేషన్ వల్ల గోరంట్ల,చిలమత్తురు,పుట్టపర్తి మండలాల్లో 1,50,000 మంది కి వినియోగదారులకు లబ్ధి పొందుతుందని

ఈ ప్రాజెక్టు ప్రధానముగా ఈ ప్రాంతంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక రంగము,వ్యవసాయ రంగమునకు పగటి పూట 9 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ అందుతుందని ,గృహ మరియు ఇతర రంగములకు మెరుగైన విద్యుత్ అందుతుం తెలిపారు.లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం మరియువిద్యుత్ ప్రసార నష్టములు మరియు అంతరాయములు తగ్గుతాయని మంత్రి అన్నారు.

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు, పర్యావరణహితమైన సౌర మరియు పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటును ఎంతగానోప్రోత్సహిస్తున్నాయని అందులో భాగంగా శ్రీసత్యసాయి మరియు అనంతపురము జిల్లా పరిసర ప్రాంతాలలో ఉత్పత్తి అయిన సౌర మరియు పవన విద్యుత్ను ఆంధ్రప్రదేశ్ గ్రిడ్ కు అనుసంధాన పరచుటకు ఈ విద్యుత్ ఉప కేంద్రము నిర్మించబడినదని తెలిపారు.ఈ ప్రాంత పరిధిలోని గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరములను తీర్చుటకు 33 కె.వి. ఫీచర్స్ ను కూడా మంజూరు చేయబడి ఉన్నది. త్వరలో ఈ పనులు కూడా చేపట్టి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పార్థసారథి , జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

# ఘనంగా స్వాతంత్ర సమరయోధుడు బిపిన్ చంద్రపాల్ జయంతి



**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పాత్రికేయుడు బిపిన్ చంద్రపాల్ గారి జయంతి మరియు రామన్ ఎఫెక్ట్ను కనిపెట్టిన భారత భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ గారి జయంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ ఆళ్లగడ్డ యూనిట్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం అపుస్మ అధ్యక్షులు టి అమిర్ భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ టౌన్ లోని శ్రీ విజ్ఞాన భారతి హై కరస్పాండెంట్ ఎన్ శివకుమార్ మరియు విద్యార్థులతో కలిసి బిపిన్ చంద్రపాల్ గారి చిత్రపటానికి మరియు సర్ సివి రామన్ గారి చిత్రపటానికి పూలమాలతో ఘనమైన నివాళులర్పించి దేశభక్తిలో స్ఫూర్తిగా నిలిచారు

# విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి

**డోన్. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్**

నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం బేతంచెర్ల మండలం ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా (ఆన్ లైన్ )ద్వారా 220 కేవి విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు.ఈ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొనగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడ్డ నంద్యాల జిల్లాకు మీ సహాయ, సహకారం ఎంతో అవసరం అని సీఎం చంద్రబాబు ను కోరారు. నాపరాతి పరిశ్రమలు అధికంగా ఉన్న బేతంచెర్ల ప్రాంతంలో నిత్యం విద్యుత్ లోవోల్టేజ్ సమస్య, కరెంటు కోత అధికంగా ఉండడం వల్ల నాపరాతి పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు ఇబ్బంది పడేవారని, 2018-2019 లో మీ చేతుల మీదుగా ఈ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారని, గత ఇదేళ్ళ వైసీపీ పాలనలో నిర్లక్ష్యం కాబడ్డ ఈ సబ్ స్టేషన్ కు మళ్ళీ మీరు ముఖ్యమంత్రి గా అయిన వెంటనే పరిపాలన అనుమతులు మంజూరు చేసి మీ చేతుల మీదుగా ప్రారంభించడం



ఆనందంగా ఉందన్నారు. విద్యుత్ కష్టాలు తొలగించిన మీకు బేతంచెర్ల ప్రాంతం రుణపడి ఉంటుందని సీఎం చంద్రబాబు కు ఎంపీ బైరెడ్డి శబరి చెప్పారు.

# రైస్ కార్డు కలిగి అర్హత ఉన్న వారందరూ దీపం పథకం-2 (ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం) ను సద్వినియోగం చేసుకోండి



## జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య

**కర్నూలు పల్లె వెలుగు న్యూస్ బ్యూరో**.......,రైస్ కార్డ్ కలిగి అర్హత ఉన్న వారందరూ దీపం పథకం-2 (ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం) ను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో దీపం పథకం-2 (ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం) కార్యక్రమం పై జాయింట్ కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ ఒకటో తారీకు నుండి దీపం పథకం-2 (ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం) కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని ఈ పథకాన్ని అర్హత కలిగిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో కూడా దీపం పథకం అమల్లో ఉండేది అందుకొరకే ఇప్పుడు ఈ పథకానికి దీపం-2 అని అనడం జరుగుతుందన్నారు. పథకానికి సిక్స్ స్టెప్స్ వాల్యుయేషన్ ఉందని అనగా ల్యాండ్, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్పోర్ట్, ఇన్కమ్ టాక్స్, ఇంటి పన్ను, తదితర వాటిని పరిగణములోకి తీసుకొని ఆ తర్వాత అర్హత నిర్ణయించడం జరుగుతుందన్నారు. గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ కనెక్షన్ కు రైస్ కార్డును, ఆధార్ కార్డును, అనుసంధానం చేసుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీల దగ్గర ఈ కేవైసీ కచ్చితంగా చేసుకోవాలని అన్నారు. 1967 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఎవరు అర్హత కలిగి ఉన్నారు, ఎవరికి అర్హత లేదు అన్న విషయాలను ఈ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. మార్చి నెల 31 వ తారీకు వరకు సిలిండర్ బుక్ చేసుకోవచ్చన్నారు. సిలిండర్ ఖాళీ కాకముందే బుక్ చేసుకుంటే ఖాళీ సిలిండర్ ఇవ్వనిదే కొత్త సిలిండర్ ఇవ్వడం జరగదని అందుకొరకే ఖాళీ సిలిండర్ ఉన్నప్పుడే బుక్ చేసుకోవాలని తెలియజేశారు. సిలిండర్ బుకింగ్ ఎప్పటి లాగానే ఆన్లైన్ ద్వారా గాని, నేరుగా ఏజెన్సీ వారి ద్వారా గాని బుక్ చేసుకోవచ్చు అన్నారు.



వినియోగదారుల డాటా ప్రభుత్వం వద్దనే ఉంటుంది, అర్హత ఉన్న వారికి ఈ పథకం కచ్చితంగా వర్తిస్తుందని అన్నారు. సిలిండర్ డెలివరీ టైమ్ లో అమౌంట్ చెల్లించవలసి ఉంటుంది, తరువాత వారి ఆధార్ లింక్ కలిగిన బ్యాంకు ఖాతాలో 24 గంటల నుండి 48 గంటలలోపు అమౌంట్ జమ అవుతుందన్నారు. మన జిల్లాలో ఇప్పటివరకు 4,72,851 మంది అర్హత కలిగిన వారు ఉన్నారని. ఇందులో ఈకేవైసీ చేసుకొని వారు సాంకేతిక లోపంతో ఇబ్బంది ఉన్నవారు, ఈ కేవైసీ చేయించుకుంటే వెంటనే ఎలిజబుల్ లిస్టులో వారి పేరు నమోదు అవుతుందన్నారు. ఈ పథకం అమలు చేసి టైం అయిపోయిందని ఎవరు అనుకోవద్దు అన్నారు.జిల్లాలో ఇప్పటివరకు %నూజా% లో 19518 సిలిండర్లు బుక్ చేసుకోగా 11589 సిలిండర్లు డెలివరీ జరిగినవి, %×ూజా% లో 25024 సిలిండర్లు బుక్ చేసుకోగా 4647 సిలిండర్లు డెలివరీ అయినవి, %దీూజా% లో32811 సిలిండర్లు బుక్ చేసుకోగా 16323 సిలిండర్లు డెలివరీ అయినవి, మొత్తంగా తీసుకుంటే 77353 సిలిండర్లు బుక్ చేసుకోగా ఇప్పటికీ 32559 సిలిండర్లు డెలివరి కాబడినవి అని జాయింట్ కలెక్టర్ అన్నారు. లబ్ధిదారులు సిలిండర్ లను ఇంటిలో వంటలకే వినియోగించుకోవాలని, అలా కాకుండా కమర్షియల్ గా వినియోగించుకున్నట్లయితే వారిపై చర్య తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ అన్నారు.

# అన్నప్రసాద వితరణ పరిశీలన



**శ్రీశైలం నవంబర్ 7పల్లె వెలుగు న్యూస్** పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా ఇంఛార్జి కార్యనిర్వహణాధికారి శ్రీ ఈ. చంద్రశేఖరరెడ్డి ఆకస్మికంగా (07.11.2024) అన్నప్రసాద వితరణ విభాగాన్ని పరిశీలించారు.

ముందుగా అన్నప్రసాదవితరణకుగాను ఈ రోజు వండిన వంటకాలను స్వయంగా పరిశీలించారు. తరువాత అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న పలువురు భక్తులతో ముఖాముఖిగా సంభాషించి అన్నప్రసాద వితరణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భక్తులందరు కూడా దేవస్థానం అందజేస్తున్న అన్నప్రసాదాల పట్ల పూర్తి సంతృప్తివ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఇంఛార్జి కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ అన్నప్రసాదవితరణలో ఆయా వంటకాలన్నీ రుచికరంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు చర్యలను చేబడుతుండాలని అధికారులను ఆదేశించారు. ఆయా వంటకాలలో కూరగాయలను విరివిగా వాడాలని సూచించారు. అన్నప్రసాదవితరణలో వండిన ప్రతీ వంటకం కూడా ప్రతీ భక్తుడికి అందేవిధంగా నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. ముఖ్యంగా అన్నప్రసాదవితరణ సమయములో ప్రతీ హాలులో కూడా అన్నప్రసాదవితరణ సజావుగా జరిగేటట్లు సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ హాలును కూడా ప్రత్యేకంగా సిబ్బందిలో ఒకరు నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు.

ఉదయం వేళలలో అన్నప్రసాదవితరణ ప్రారంభంలోనూ, సాయంకాలం అల్పాహార ప్రారంభంలోనూ ఖచ్చితంగా సమయపాలనను పాటించాలన్నారు.

అన్నప్రసాదాలను స్వీకరించే భక్తులు అధికసమయం వేచివుండకుండా వుండేవిధంగా ఎప్పటికప్పుడు తగు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా అన్నప్రసాదవితరణభవన ప్రాంగణములో చేయబడుతున్న సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగు పనులను ఇంఛార్జి కార్యనిర్వహణాధికారివారు పరిశీలించడం జరిగింది.

# రాష్ట్రస్థాయికి దుద్యాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి



**కొత్తపల్లి: నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్ :** రాష్ట్ర స్థాయికి దుద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న గంగాధర్ రెడ్డి ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం దుద్యాల పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ పాఠశాల నందు సెప్టెంబర్ నెల 23 వ తేదిన జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరగాయన్నారు. అందులో భాగంగా నిర్వహించిన అండర్ 17 బాల్బాడ్మింటన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరచాడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈనెల తూర్పుగోదావరి జిల్లాలో 9,10 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి బాల్బాడ్మింటన్ క్రీడాపోటీలలో పాల్గొంటాడని చెప్పారు. అక్కడ కూడ ఉత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి గంగాధర్ రెడ్డిని ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, కృష్ణయ్య, రాఘవేంద్ర, విజయ్కుమార్, రామయ్య, వసుంధర, భారతి, నూర్జాన్, శ్రీ సుధా ఉన్నారు.

# ఆక్రమణకు గురైన దారిని పునరుద్ధరించండి-ఎమ్మార్పీఎస్

**పాములపాడు నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్ :** మండల కేంద్రమైన పాములపాడు ఎస్సీ కాలనీ నుండి రామసముద్రానికి వెళ్లే దారిని కొందరు కబ్జాలకు గురి చేస్తున్నారని, కనుక మెటల్ వేసి, దానిపైన తారు రోడ్డును నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ లింగాల స్వాములు మాదిగ ప్రభుత్వాన్ని,అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ఎల్.స్వాములు మాట్లాడుతూ రామసముద్రం గ్రామానికి చెందిన ప్రజలు ఏదైనా అవసరాల కోసం కానీ వైద్యం కోసం ఇతరాత్ర పనుల నిమిత్తం రావాలంటే ఈ దారి గుండా రావాలని అయితే రామసముద్రం నుండి పాములపాడు రావాలంటే రోడ్డు వెంట మోకాలు లోతు గుంతలతో, పిచ్చి పొదలతో ప్రయాణం నరకప్రాయంగా ఉందని ఆయన అన్నారు. గతంలో రాత్రి వేళలో పాముకు కాటు గురైనా, అకస్మాత్తుగా ప్రమాదాలు సంభవించిన, వైద్యం కోసం మండల కేంద్రమైన పాములపాడు కు రావాల్సి వస్తుందని దారికి ఇరువైపులా కంప చెట్లు అడ్డంగా ఉండడం వలన సరైన సమయానికి వైద్యం అందక గతంలో పాము కాటుకు గురై చనిపోయిన సందర్భాలు ఉన్నాయని ఆయన అన్నారు. పాములపాడు నుండి రామసముద్రం వరకు పొలాలు ఉన్న రైతులు ఇరువైపుల రోడ్డు ఆక్రమించడం వలన ఈ పరిస్థితి దాపరిచిందని ఆయన అన్నారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు ఈ రోడ్డును పట్టించుకోకపోవడం వలన ఈ దుస్థితికి వచ్చిందని ఆయన అన్నారు. ఎన్నో వేల వ్యవసాయ భూములు ఉన్న రైతులు పన్నుల రూపంలో కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం అందించిన కూడా రెవెన్యూ అధికారులు రైతులకు సరైన రోడ్డు మార్గం చూపలేకపోవడం వలన, పండించిన పంటలను ఈ రోడ్డు మార్గంలో ఇంటికి తీసుకెళ్లలేక పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు రామసముద్రం గ్రామ ప్రజల వైద్య అవసరాల కోసం అటు పాములపాడు రైతులను దృష్టిలో ఉంచుకొని వెంటనే రోడ్డు నిర్మించాలని లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రామసముద్రం గ్రామ ప్రజలను, పాములపాడు రైతులను సమాయత్తం చేసి, పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.



# జిల్లాలో.. జమ్మలమడుగు మండలం తలమంచిపట్నం వద్ద 400 కెవి సబ్ స్టేషన్ లైన్ విస్తరణ పనులతో పాటు.. మైదుకూరు వద్ద 220 కెవి సబ్ స్టేషన్ లైన్ల అనుసంధాన పనులకు శంఖుస్థాపన







**కడప, చీఫ్ బ్యూరో నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్** రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల ప్రజలు, రైతులకు లో ఓల్టేజీ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందించడమే.. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు.గురువారం రాజధాని పరిధిలోని తాలాయపాలెం నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నుండి.. వర్చువల్ ద్వారా.. పలు జిల్లాలతో పాటు మన జిల్లాలోని జమ్మలమడుగు మండలం తలమంచిపట్నం వద్ద 400 కెవి సబ్ స్టేషన్ లైన్ పనులకు శంఖుస్థాపనతో పాటు.. మైదుకూరు వద్ద 220 కెవి సబ్ స్టేషన్ లైన్ల అనుసంధాన నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. సంబందిత శాఖల మంత్రులు, కార్యదర్శులతో కలిసి శంఖుస్థాపన చేశారు.

జమ్మలమడుగు మండలం తలమంచిపట్నం గ్రామంలో 400 కెవి నూతన సబ్ స్టేషన్ ఆవరణలో విస్తరణ పనుల కోసం ఏర్పాటు చేసిన శిలా ఫలకాల ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్. చెరుకూరి తోపాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి హాజరయ్యా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎపి ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ సంస్థ (%ఘ్రూ=ూచీూజూ%) ఆధ్వర్యంలో.. వైఎస్ఆర్ కడప జిల్లాలో మొట్టమొదటి సారిగా జమ్మలమడుగు మండలం.. తలమంచిపట్నం గ్రామంలో.. రూ.193.30 కోట్ల వ్యయంతో.. 98.17 ఎకరాల విస్తీర్ణంలో 400 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని 2016 జులై 15వ తేదీన శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ విద్యుత్ ఉపకేంద్రము ద్వారా మన వైఎస్ఆర్ కడప మరియు అనంతపురము జిల్లాల నందు ఉత్పత్తి అయ్యే పవన మరియు సోలార్ విద్యుత్ గ్రిడ్కు అనుసంధానించే.పనుల కోసం ఈ రోజు శిలాఫలకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 400 కెవి సబ్ స్టేషన్ లేదని, జిల్లాను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో.. జమ్మలమడుగు మండల ప్రాంత పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రస్తుతం ఈ ప్రాంతంలో పారిశ్రామిక, వ్యవసాయ, గృహావసరాలను తీర్చేందుకు 400 కె.వి. విద్యుత్ ఉప కేంద్రాన్ని విస్తరించడం జరుగుతోందన్నారు. ఈ విద్యుత్ ఉపకేంద్రం నుండి 1630 ఎం.వి.ఎ. సామర్థ్యం గలా ట్రాన్స్ఫార్మర్ ల నుండి వివిధ సంస్థల ద్వారా మొత్తం 1397.50 మెగావాట్ల నాణ్యమైనవిద్యుత్నునిరంతరాయంగా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం నుండి సహాయ సకహకారాలు తప్పక అందిస్తామన్నారు.ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే కరెంట్ అన్న నినాదంతో.. భవిష్యత్తులో మన జిల్లా నుండి దేశానికి కూడా విద్యుత్ అందించే స్థాయికి మన జమ్మలమడుగు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విద్యుత్ ఉపకేంద్రం అనుసంధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాలకు కూడా.. నాణ్యమైన విద్యుత్ ను అందించే అవకాశం కలుగుతుందన్నారు. రానున్న కాలంలో జమ్మలమడుగు నియోజకవర్గం పారిశ్రామికంగా మరింత అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రధానంగాజమ్మలమడుగు, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, దువ్వూరు, పోరుమామిళ్ళ, చక్రాయపేట, తదితర ప్రాంతములకు లో వోల్టేజి సమస్య తీరటంతో పాటు నాణ్యతతో కూడిన మెరుగైన విద్యుత్ అందనుందన్నారు. రైతాంగానికి వ్యవసాయ అవసరాల నిమిత్తం పగటిపూట 9 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుందన్నారు. అంతేకాకుండా విద్యుత్ ప్రసారంలో అంతరాయాలను అరికట్టడంతో పాటు.. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో పారిశ్రామిక, గృహ అవసరాలకు ఈ విద్యుత్ ఉపకేంద్రం ఎంతో ప్రయోజన కరంగా మారనుందన్నారు. జిల్లాలోని జమ్మలమడుగు మండలంతలమంచిపట్నంలో.. 400 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ తో పాటు.. మైదుకూరులో 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ అనుసంధాన పనులకు.. గురువారం వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శిలాఫలకాన్నిఆవిష్కరించారు. ప్రస్తుతం వై.యస్.ఆర్ జిల్లాలోని మైదుకూరు ప్రాంత పరిధిలో రూ.59.85 కోట్ల వ్యయంతో.. సుమారు 8 కిమీ పొడవు మేర 220/33 కె. వి. సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ఉపకేంద్రం లైన్ల అనుసంధానం వల్లన మైదుకూరు, ఖాజీపేట మండలాల్లోని గృహ, యాత్రికులు, వాణిజ్య మరియు చిన్న తరహా పరిశ్రమల విద్యుత్ అవసరాలకు ఎంతో ఉపకరిస్తోంది.నానాటికి పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగ్గట్లు.. లోడ్ డిమాండ్లను తట్టుకోవడానికి, వోల్టేజ్ ప్రొఫైల్ నాణ్యత మెరుగుపరచడానికి విశ్వసనీయమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడానికి మైదుకూరులోని 220/33 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని.. 220 కె.వి. సామర్థ్యం గల జమ్మలమడుగు – పోరుమామిళ్ల విద్యుత్ లైన్ ను అనుసంధానం చేసేందుకు ఎ.పి. ట్రాన్స్ కో సంస్థ.. 220 కె.వి. విద్యుత్ లైన్ నిర్మించుటకు నిధులను మంజూరు చేయడం జరిగింది. దీని వలన మైదుకూరు, ఖాజీపేట, చెన్నూరు, కడప, వల్లూరు, చింతకొమ్మదిన్నె మండలాలకు చెందిన 103 గ్రామాల్లోని 3,50,000 మంది వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనుంది.

ఈ కార్యక్రమంలో.. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ట్రాన్స్ కో సీఈ కృష్ణమ నాయుడు, ఎస్ఈలు శ్రీనివాసరావు (ఎలెక్ట్రికల్), విశ్వేశ్వర్ రెడ్డి (సివిల్), శ్రీనివాసరావు (టెలికాం), ఏపీఎస్పీడిసిఎల్ ఎస్.రమణ, యువ నాయకులు భూపేష్ రెడ్డి, ఆయా విద్యుత్ శాఖల ఈఈలు, ఏఈలు, తదితర ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక నగరం అభివృద్ధికి అందరూ కలసి కట్టుగా పనిచేద్దాం

**– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**అభివృద్దే అందరి అజెండా.. మేయర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య**

**అభివృద్ధికి తిరుపతి ఐకాన్ లా ఉండాలి. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం**

**తిరుపతి నగరపాలక సంస్థ**






**తిరుపతి చీఫ్ బ్యూరో నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్** ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగర అభివృద్ధికి రాజకీయ నాయకులు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్పొరేటర్లు, అధికారులకు పిలుపునిచ్చారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం గురువారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్ నందు మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కమిషనర్ ఎన్.మౌర్య అజెండాను ప్రవేశ పెట్టారు. కౌన్సిల్ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎం.ఎల్.సి. సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. వీరితో పాటు డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలపై చర్చించి అభివృద్ధి పనులకు ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రమైన మనం నివాసం ఉంటున్నామని ఇది మనకెంతో అదృష్టం అన్నారు. రాజకీయాలను వదిలి అందరం కలిసికట్టుగా కూర్చుని చర్చించుకుని నగర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న నిధులను అవసరాలను బట్టి కార్పొరేటర్లతో అధికారులు చర్చించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలన్నారు. నగరపాలక సంస్థలు కార్పొరేటర్లు కూర్చునేందుకు హాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ కు తెలిపామని అన్నారు. నగరంలో ఉన్న పార్కుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించి, వాకింగ్ టాక్ మరమ్మతులు చేయాలని అన్నారు. టి.డి.ఆర్. బాండ్లు కొరకు పెద్ద సంఖ్యలో బాధితులు వస్తున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని అన్నారు. నగరంలో రోడ్లకు పాట్చ్ వర్కులు, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్పొరేటర్లు శ్రీవారి దర్శన ఏర్పాట్ల కొరకు బోర్డులో చర్చించి మంచి నిర్ణయం తీసుకునేలా చూస్తానని తెలిపారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి మన అజెండాగా అందరూ ముందుకుసాగాలని అన్నారు. మంచి నిర్ణయాలకు మన కౌన్సిల్ వేదిక కావాలని, లేని పోని చర్చలు వద్దు అన్నారు. మనం చేసే అభివృద్ధి ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగేలా నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. అన్ని విభాగాల అధికారులు ఆయా వార్డుల్లో కార్పొరేటర్లకు, ప్రజలకు అందుబాటులో ఉంటారని అభివృద్ధి పనులకు తాము ఎప్పుడు బాసటగా నిలుస్తామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉందన్నారు. తిరుపతిలో జరిగే అభివృద్ధి అందరికీ ఆదర్శం కావాలన్నారు. నగరంలో కూరగాయల మార్కెట్ వెళ్తే ఎక్కడపడితే అక్కడ షాప్ లు పెట్టడంతో అపరిశుభ్రంగా ఉందని సరి చేయాలన్నారు. హోటల్స్ లో ఆహార పదార్థాలు సరిగా ఉండడం లేదని, అధికారులతో కూడిన టాస్ఫోర్స్ బృందం ఏర్పాటు చేయాలన్నారు. ఈ టాస్క్ ఫోర్స్ బృందం ఎప్పటికప్పుడు నగరంలో తిరుగుతూ హోటల్స్ ని తనిఖీ చేస్తే ప్రజలకు మంచి ఆహారం ఉంటుందన్నారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ టౌన్ క్లబ్ వారి వద్ద నుండి తీసుకున్న స్థలమునకు టిడీఆర్ బాండు వెంటనే ఇవ్వాలని అన్నారు, ఎం.పి., ఎమ్మెల్యే లు చొరవ చూపి నగర అభివృద్ధికి నిధులు తెప్పించాలని కోరారు. పలువురు కార్పొరేటర్లు తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని, వార్డుల అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చించాలని కోరారు.



# శ్రీశైల దేవస్థానం లో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు






**శ్రీశైలం. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్** శ్రీశైల దేవస్థానం లో సాంస్కృతిక కార్యక్రమాలు దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) నాట్యతరంగిణి కూచిపూడి డాన్సు ఇన్స్టిట్యూట్, విజయవాడ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం కార్యనిర్వహణాధికారి చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఈ కార్యక్రమములో వినాయక ప్రార్థన, నాగస్తుతి, శివతాండవం, శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, శంకరా శశిధర, బాలాత్రిపుర సుందరి తదితర అష్టకాలకు, గీతాలకు ఎ.ఎస్. ప్రజ్ఞ, ఎన్.ప్రణిక, పి. లక్షిత, నీలిమ, చరణ్ తేజ, యోషిత భాగ్యశ్రీ, విద్య, చందన, భవ్యాంజలి, వేదాన్షి, రుత్విక, పూజశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు.

అలాగే రెండవ కార్యక్రమములో భాగంగా శ్రీ సాయి నృత్యకళాశాల, నందికొట్కూరు వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమములో శ్రీ గణనాథం, శ్రీశైల గిరిజా ప్రభు, స్వామి మల్లయ్య, ఓం నమ: శివాయ, అయిగిరినందిని, నమో నమో నటరాజ తదితర గీతాలకు అఖిలనాయుడు, లిఖిత, జలనేల శిరీష, గౌతికాకర్ణి, యామినికృష్ణ, చరణ్ కుమార్, మాధురి దీక్షిత, సింధూర తదితరులు నృత్య ప్రదర్శన చేయనున్నారు.

కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ,







బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిర్వహించబడుతున్నాయి.

## 98.32 కోట్లతో నిర్మించిన నూతన విద్యుత్ ఉప కేంద్రంను వర్చువల్ గా ప్రారంభించిన సిఎం



**బేతంచెర్ల నవంబర్ 7పల్లె వెలుగు న్యూస్** బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పంచాయితి లోని మజరా గ్రామం కొమ్మూరు కొట్టాల గ్రామ సమీపాన రైల్వే గేట్ ప్రక్కన 98.32 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రం ను గురువారం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ విద్యుత్ ఉపకేంద్రం దగ్గర ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథులుగా డోన్ ఎంఎల్ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,నంద్యాల ఎంపి శబరి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి యువ నాయకులు రాఘవేంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ 98.32 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించ బడిన ఈ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయుట సంతోషకర పరిణామం అన్నారు. బేతంచెర్ల, డోన్, బనగాన పల్లె మండలాలలో 80 వేల మంది లబ్ది దారులకు విధ్యుత్ అందిస్తుందని అలాగే ప్యాపిలి మండలం లో 32 కేవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీని వల్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరునింపి వ్యవసాయ రంగం మెరుగు పడే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన బీజేపి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, జిల్లా, మండల స్థాయి అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.





## శాస్త్రీయ విద్యా సాధకై ఉద్యమించాలి

### విద్యార్థి అమరవీరుల శిలాఫలక ఆవిష్కరణ

### పీ డీ ఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్



**కర్నూలు పల్లె వెలుగు న్యూస్ బ్యూరో.......**విద్యార్థి అమరవీరుల ఆశయ సాధనకే ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు.

కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో కామ్రేడ్ నీలం రామచంద్రయ్య స్తూపం కు విద్యార్థి అమరవీరుల శిలాఫలకాన్ని పూర్వ పీ డీ ఎస్ యూ రాష్ట్ర నాయకులు శేషపాణి, మల్లికార్జున ఆవిష్కరించడం జరిగింది. అనంతరం పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడు రమణ అధ్యక్షత వహించగా వారు మాట్లాడుతూ విప్లవ విద్యార్థి ఉద్యమానికి కామ్రేడ్ జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, రంగవల్లి, మారోజు వీరన్న లాంటి ఎంతోమంది ప్రాణాలను తృణంగా పెట్టి విద్యార్థి హక్కుల కోసం పోరాటం చేశారని అన్నారు. దేశంలో శాస్త్రీయ విద్యా విధానం, సమ సమాజ స్థాపన లక్ష్యంగా విద్యార్థి హక్కుల కోసం పీ డీ ఎస్ యూ ఉద్యమిస్తుందని అన్నారు. 1974 అక్టోబర్ 12 తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో పీ డీ ఎస్ యూ ఏర్పడిందని నేటికీ 50 సంవత్సరాలు పూర్తి చేస్తుందని అన్నారు. విద్యార్థి అమరవీరుల ఆశయ సాధన కోసం నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం విద్యా వ్యవస్థను కాసాయికరణ, ప్రైవేటీకరణ చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. ఈ విద్యా విధానం ద్వారా ప్రభుత్వ విద్య నీరుగాస్తూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు దారిదప్తం చేయడానికి ఈ విద్యా విధానం ఉందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మూసివేసే జీవో నెంబర్ 118ను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు ధరలు అనుగుణంగా మేస్,కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మతోన్మాద వ్యతిరేక పోరాటమే విద్యార్థి అమరవీరులకు నిజమైన నివాళులని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదర్, శశికాంత్, నిఖిల్, సిద్ధార్థ్, న్యూ డెమోక్రసీ నాయకురాలు మనీ, వెంకటస్వామి, మధు, గ్రామ సర్పంచి జయన్న గౌడ్ మొదలైన వారు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు

### -ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ధ్వజం

**విజయవాడ. నవంబర్ 07 .పల్లె వెలుగు న్యూస్**

గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, మెగా డీఎస్సీ నుంచి మినహాయించి, కాంట్రాక్ట్ రెగ్యులర్ టీచర్స్ గా ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ ఎస్ టి యు రాష్ట్ర కార్యాలయంలో గిరిజన గురుకుల ఔట్సోర్సన్ ముఖ్య ఉపాధ్యాయుల తో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. గురుకుల ఉపాధ్యాయులకు మద్దతుగా రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 15 ఏళ్లుగా సబ్జెక్టు టీచర్స్ గా పని చేస్తున్న 1633 మంది ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోకపోగా వారి పోస్టులను 2024 మెగా డీఎస్సీలో కలపడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో గిరిజన గురుకులాల్లో మాత్రమే ఔట్సోర్సింగ్ విధానం అమలవుతుందని ధ్వజమెత్తారు. ఎస్సీ బీసీ గురుకులాలకు డీఎస్సీలో మినహాయించినప్పుడు గిరిజన గురుకులాల ఉపాధ్యాయులను ఎందుకు డీఎస్సీలో మినహాయించరని విద్యాశాఖ మంత్రి లోకేష్ ను ప్రశ్నించారు. ఎన్నో మార్లు వినతి పత్రాలు, ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతి పత్రాలు సమర్పించిన ఎలాంటి చలనం లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను గడుపుతున్న అడవి బిడ్డల పైన ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ప్రభుత్వాన్ని విన్నవించారు. విజయవాడ మహానగరంలో మూడు రోజులు పాటు ధర్నా చౌక్ నందు నిరసన కార్యక్రమాలు చేపడుతున్న ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం గిరిజనుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు.

గిరిజన గురుకులాలలో పనిచేసే అవుట్సోర్సింగ్ ప్రతి టీచర్లకు ప్రతినెల హెల్త్ కార్డు కొరకు ఈ ఎస్ ఐ కట్ చేసుకుంటూ వారు జీతాలకు గండి కొట్టడమే కాకుండా డబ్బులు చెల్లించుకొని వారికి ఎటువంటి వైద్య సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు.

శ్రమదోపిడి చేస్తూ వారు ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గురుకుల పని చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకుండా వారికి అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకొని కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఎటువంటి సెలవులు కూడా ఇవ్వకుండా దసరా సంక్రాంతి తప్ప మిగతా సెలవు దినాలు ఇవ్వకుండా వారికి పని ఒత్తిడి భారం వల్ల మానసికంగా శారీరకం చాలా ఇబ్బందులు కలిగిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలు పనిచేసే టీచర్లకు గురుకుల పాఠశాలలో పనిచేసే టీచర్లకు ఒకే విద్యార్హత కలిగిన వారికి జీతాలలో మాత్రం ఎందుకు ఇంత తేడా చూపిస్తున్నారు అని సూటిగా అడిగారు.గిరిజన గురుకులాలలో పనిచేసే ఔట్సోర్సింగ్ టీచర్లను ఎంపిక విధానము జిల్లా కలెక్టర్ ద్వార



ఐ టి డి ఏ పి ఓ ద్వారా అలాగే గురుకులం ద్వారానే ఎంపిక చేయడం జరిగింది. వారికి జీతాలు పెంచడంలో కాంట్రాక్ట్ చేయడంలో మాత్రం వారికి ఇబ్బందులు కలిగిస్తూ ఉన్నారు.గిరిజన గురుకులాల్లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులకు మరియు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వారికి అతి తక్కువ జీతం 9500 రూపాయలతో వారి యొక్క నెల జీవితం గడపాల్సి వస్తుంది. ఇంత తక్కువ జీతాలతో వారి యొక్క కుటుంబాన్ని వారి యొక్క పిల్లలని మరియు నిత్యవసర సరుకులతో ఎలా పోషించుకుంటారని అన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన ఉపాధ్యాయులకు దగా చేస్తోందని పలువురు ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయుడు, సంఘ నాయకుడు మల్లికార్జున నాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయ నాయక్,రమణ, పరమేశు , శ్రీనివాసు, బాబు, నరసింహతదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ , ఎస్టీ విద్యార్థులు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ

**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 పల్లె వెలుగు న్యూస్** :ఉచిత డియస్సీ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ , ఎస్టీ విద్యార్థులు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించే తేదీ 10.11.2024 ఉదయము 10.00 గంటల నుండి మధ్యహ్నము 1:30. వరకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా రెసిడెన్సీయల్ విధానములో ఉచిత డియస్సీ శిక్షణ పొందుటకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ నెల 10 వ తేదీ జరిగే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి గనియ ఆదేశాల ప్రకారము డి.ఆర్.ఓ చాంబరులో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, రవాణా, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖల ఆదికారులతో మరియు కళాశాల ప్రిన్సిపల్స్ తో జిల్లా లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ పైన సమీక్షించి సంబందిత ఆదికారులతో పలు సూచనలు చేశారు. ఈ సందర్భముగా డి.ఆర్.ఓ వారు మాట్లాడుతూ ఉచిత డి.యస్సీ శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల ఎంపికకు జిల్లా లోని నాలుగు పరీక్ష కేంద్రాలలో కంప్యూటరు ఆదారిత పరీక్ష (సి.బి.టి.) నిర్వహించడము జరుగుతుందన్నారు. ఈ నేపద్యములో ఆయా పరీక్ష కేంద్రాలలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయము లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జనరేటర్లు సిద్దంగా ఉండాలని, కంప్యూటరు సమస్యల పరిస్కారానికి సాంకేతిక సిబ్బంది సిద్దమూగ ఉండాలన్నారు. ఆదేవిధముగా పరీక్ష జరిగే రోజు పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకు వీలుగా రవాణా సౌకర్యము కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ ఆదికారులకు మరియు పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయము, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సంబందిత ఆదికారులకు సూచించారు. పరీక్ష కేంద్రముల తో పాటు పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు ఆదికారులకు డి.ఆర్.ఓ సూచించారు. జిల్లా లోని ఆర్.జి.యం. ఇంజనీరింగ్ కళేజి, శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజీ, నేషనల్ డిగ్రీ కాలేజీ మరియు రామకృష్ణ పి.జి కాలేజీ లలో ఈ నెల 10 వ తేదీ ఉదయము 10:30 గంటల నుండి మధ్యాహ్నము 1:30 వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను ఉదయము 9:15 గంటల నుంచి 10:00 గంటలకు పరీక్ష కేంద్రము లోనికి అనుమతించబడును, %ట్ట్రజూం://యఖుఖుఎష్టబఎఱ.ఖజూ.న్రశీఙ.అఅ ఒవఎంత్‌వ% నందు అభ్యర్థులు హాల్ టికెట్స్ డౌన్లోడ్ చేసుకోవాలి మరియు అభ్యర్థుల సెల్ ఫోన్ కు మెసేజ్ కూడ వచ్చునని డి.ఆర్.ఓ వారు తెలియజేశారు. ఈ



సమావేశమునకు సాంఘిక జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమం సాదికరత ఆదికారిణి, యం. చింతామణి, పోలీసు శాఖ ఆదికారులు, నంద్యాల జిల్లా ఆర్.టి.సి డిపో మానేజరు, గిరిజన సంక్షేమ శాఖ, ఎటి.డబ్ల్యూ.ఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదికారి, మరియు నలగు కళాశాలల యజమాన్యము వారు తదితరులు పాల్గొన్నారు.జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమం సాదికరత ఆదికారి, నంద్యాల జిల్లా.

లి అభ్యర్థులు స్పష్టమైన ఆదార్ గుర్తింపు కార్డు వెంట తీసుకొని పరీక్ష కేంద్రానికి రావలెను.

లి రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తీసుకొని పరీక్ష కేంద్రానికి రావలెను.

## నంద్యాలలో ఖాళి స్థలాలు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం

### -బి.సి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చింతలపల్లె సుధాకర రావ్

**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్** ):నంద్యాలలో వైసిపి ప్రభుత్వహయాంలో "ఉద్యోగుల సంఘభవన్" అమ్మేసిన ఘనులు ,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘానికి గత 50 సంవత్సరాల నుండి నంద్యాల ఎమ్మార్వో ఆఫీసుకు ఎదురుగా మూడున్నర సెంట్ల స్థలంలో ఉన్న



రూమును సంఘంలోని ముగ్గురు వ్యక్తులు మూడు కోట్ల విలువైన స్థలాన్ని కేవలం అరవై లక్షలకు గత వైసీపీ ప్రభుత్వహయాంలో తొమ్మిది నెలల క్రితం అమ్మరని బి.సి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చింతలపల్లె సుధాకర రావ్ ఆరోపించారు.సంబందిత ఉన్నతాధికారులు ఎందుకు చూసీచూడనట్లు వున్నారో నంద్యాల ప్రజలకు బోధపడడంలేదని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అమ్మకాలు జరిపిన వారిపై, అలాగే కొన్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, ఇలాగే ఉన్నతాధికారులు ఊరుకుంటే నంద్యాలలో వుండే ఖాళి స్థలాలు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం వుందని, జిల్లా కలెక్టర్ స్పందించని పక్షంలో ఏకంగా సి.ఎం ఫిర్యాదుల గ్రేవెన్స్ ద్రష్టికి తీసుకుని వెళ్తానని బి.సి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చింతలపల్లె సుధాకర రావ్ తెలిపారు.

## ప్రాజెక్టుల నిర్మాణ, నిర్వహణలో సమతుల్యం పాటించండి

### -బొజ్జా దశరథరామిరెడ్డి

**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్** ):నీటి లభ్యత వున్నప్పటికీ ప్రాజెక్టుల నిర్మాణ, నిర్వహణలో సమతుల్యం పాటించకపోవడం వలన రాయలసీమ వ్యవసాయ యోగ్యమైన భూమిలో కేవలం 9 శాతం భూభాగానికి సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లభిస్తుండటంతో నిత్యం కరువు బారిన పడుతున్న రాయలసీమలో జలసంరక్షణ ఆవస్యకతను వివరిస్తూ పుస్తక రూపంలో ముఖ్యమంత్రి కి వ్రాసిన విజ్ఞాపన పత్రాన్ని బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కి అందజేశారు. వంద రోజులుగా నిరంతరాయంగా కృష్ణా, తుంగభద్ర నదులలో ప్రవహిస్తున్న జలాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైన రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల దుస్థితిపై వివిధ దినపత్రికల నియోజకవర్గ/ జిల్లా ఎడిషన్లలో వచ్చిన వార్తలు, పాలకుల హామీలు, ప్రజల ఆకాంక్షల కూర్పుతో రూపొందించిన పుస్తకంలోని అంశాలను కలెక్టర్ గారికి వివరించామని బొజ్జా పేర్కొన్నారు.రాయలసీమ ప్రాజెక్టుల దుస్థితికి గల కారణాలను ప్రభుత్వం సులభంగా అర్థం చేసుకోవడానికి రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల ఆధారంగా "బ్రాడ్" గా శిథిల విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలు, అసంపూర్ణ విగ్రహాలు, శైశవదశ విగ్రహాలు, జీవచ్ఛవ విగ్రహాలు, ఆశావహ (స్వప్న) విగ్రహాలుగా చేసిన వర్గీకరణను ఈ పుస్తకంలో వివరించామని బొజ్జా తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సగటున 30 శాతం భూమికి సాగునీరు లభిస్తున్నదని, కానీ రాయలసీమలోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా కేవలం 9 శాతం భూమికి మాత్రమే సాగునీరు లభిస్తున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చామని ఆయన తెలిపారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రాజెక్టుల నిర్మాణ, నిర్వహణలో సమతుల్యం



పాటించకపోవడం వల్ల రాయలసీమ వ్యవసాయ యోగ్యమైన భూమిలో కనీసం 30 శాతానికి కూడా సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని, ఈ పరిస్థితి వలన ఈ ప్రాంతం కరువు పీడిత ప్రాంతం క్యాటగిరిలోకి నెట్టివేయబడిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

## లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వం తీసుకున్న రామ మద్దయ్య

**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 పల్లె వెలుగు న్యూస్** ):రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా 17 వార్డు టిడిపి ఇంచార్జ్ రామ మద్దయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం (లక్ష రూపాయల సభ్యత్వం) తీసుకోవడం జరిగిందని తెలియజేశారు .. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ రామ మద్దయ్య ను అభినందించడం జరిగింది.








# జాతీయ విద్యా దినోత్సవ సందర్భంగా వకృత్వ పోటీలు

**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస్ )**
:నంద్యాలలోని స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఈనెల 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని అల్మేవ నాయకులు అబులైజ్ ఏర్పాటు చేసిన వకృత్వపు పోటీలను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఉర్దూ కళాశాల లో జరుగుతున్న వకృత్వపు పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చూపించి విజయం సాధించాలని తెలియజేశారు అదేవిధంగా ఉర్దూ కళాశాల అభివృద్ధికి ఖచ్చితంగా మా సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశార . అనంతరం గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని సునీత , ప్రిన్సిపల్ కరిముల్లా , టిడిపి పట్టణ అధ్యక్షులు ఖలీల్ , సమ్మద్ , ఇసుక చాంద్ , గఫార్ , కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.







# పోలీస్ స్టేషను ఆకస్మిక తనిఖీ చేసిన నగర పోలీస్ కమీషనర్







## ఎస్. వి. రాజ శేఖర బాబు

**విజయవాడ చీఫ్ బ్యూరో నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్** నగర పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు నార్త్ డివిజన్ పరిదిలోని నున్న పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్లోని రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాల గురించి, ఈ పహారా బీట్ల గురించి, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చెడు నడత కలిగిన వ్యక్తులపై తీసుకోవాల్సిన చర్యల గురించి ఇన్స్పెక్టర్ కి పలు సూచనలు ఇచ్చారు.ఎవరైనా తప్పు చేస్తే సహించేది లేదని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం, సోషల్ మీడియా ద్వారా ఇతరులను వేధించడం, పరువు ప్రతిష్టలకు భంగం కలిగేవిధంగా చేయకూడదని, అట్లు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ గారు సిబ్బందితో మాట్లాడుతూ .స్టేషన్ కు వచ్చిన బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద నుండి వచ్చే పిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని తెలియజేశారు. పెండింగ్ కేసులను తగ్గించాలి అని, బీట్స్ బాగా పెంచి స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై దృష్టి సారించాలని, సైబర్ నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు అక్రమ రవాణా మరియు అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి నిఘా పెంచి వాటి పై పూర్తిస్థాయి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. నిర్మానుష ప్రదేశాలు మరియు పరిసర ప్రాంతాలలో తిరుగు అనుమానస్పద వ్యక్తులపై, గంజాయి విక్రయ మరియు సేవించు వ్యక్తులపైన అదేవిధంగా చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చెయ్యాలని, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని తెలియజేసారు.కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ గారితో పాటు నున్న ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు

# ఎన్నికేసులు భనాయించినా భయపడేదిలేదు

## -ధైర్యంగా ఎదుర్కొంటా
## -ఎమ్మెల్సి ఇసాక్ బాష





**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 07 . పల్లె వెలుగు న్యూస**
:తనపై ఎన్ని తప్పుడు కేసులు భనాయించినా తాను భయపడేదిలేదని ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష పేర్కొన్నారు. నంద్యాల వన్టేన్ పోలీస్ స్టేషన్ నందు ఎమ్మెల్సీ ఇసాక్ బాషపై ఎస్పీ అబ్దుల్ సలాం అనే వ్యక్తి 2013లో జరిగిన కేసుకు సంబంధించి నేడు తనపై కేసు నమోదు చేయడం జరిగిందని, ఈ విషయంపై చట్టపరిదిలో తగిన న్యాయం కోసం పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ ఇసాక్ బాష స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మీడియా సమావేశంలో తనపై నమోదు కాబడిన కేసులు, వాటి వివరాలనువెల్లడించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ...2013లో గత 11 సంవత్సరాల క్రితం నంద్యాల పోస్టాఫీస్ వద్ద అపార్ట్మెంట్ నిర్మాణానికి సంబంధించి అబ్దుల్ సలాం అనే వ్యక్తి గొడవ చేయడం జరిగిందన్నారు. ఈ ఘనటలో తమపై ఎస్పీ అబ్దుల్ సలాం దుర్భాషలాడుతూ తోపులాట చేసి ఘర్షణ చేయడం జరిగింది. ఈ విషయంపై నాడు అతనిపై కేసు వేయగా పలు ఆధారాలతో కేసు కొట్టివేయడం జరిగింది. అయితే ఈకేసుకు సబంధించి ఎస్పీ అబ్దుల్ సలాం రాజకీయంగా తనపై నాడు తప్పుడు కేసు బనాయించాడన్న ఆరోపణలు చేస్తూ తనపై వన్టేన్లో కేసు పెట్టడం జరిగిందన్నారు. అలాగే జుమ్మామసీదుకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేశానని ఆరోపణలు చేయడం జరిగిందని ఇది సత్యదూరమన్నారు. అలాగే తాను చేపట్టిన అపార్ట్మెంట్కు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సదరు వ్యక్తికి తగదని, దీనిపై తాను న్యాయస్థానంను ఆశ్రయించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

మీడియా సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు డాల్మిల్ అమీర్ భాషా పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు డి పాల్ పాఠశాల విద్యార్థులు,

**ఆత్మకూరు నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస**
రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోర్టీలకు అండర్-14 విభాగంలో ఎంపికైనట్లు డి పాల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్స్ షిన్స్ వైస్ ప్రిన్సిపాల్, ఫాదర్,వినీత్.లుతెలిపారు,గురువారం రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన యుగంధర్ మోహన్ కృష్ణ సాయి లను డిపాల్ పాఠశాల యజమాను అభినందించారు, ఈ సందర్భంగా ఫాదర్స్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్అండర్-14,విభాగంలో డిపాల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు, ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్



షిప్ పోటీలలో పాల్గొంటారని అన్నారు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన యుగంధర్, మోహన్ కృష్ణ,సాయిలతో పాటు అందుకు కృషిచేసిన యామయ్య ఉపాధ్యాయులను అభినందించారు,విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒక్కరూ క్రీడలపై ముగ్గుచుపాలన్నారు,రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగి బంగారు భవిష్యత్తును పొందాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో డిపాల్ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

# క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి,



**ఆత్మకూరు నవంబర్ 7పల్లె వెలుగు న్యూస్** క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పవన్ కుమార్ అన్నారు, ఈ సందర్భంగా డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్ వ్యాధి రకాలు లక్షణాలు చికిత్సలు తదితర వాటిపై వివరించామన్నారు, మగవారిలో బీడీలు, సిగరెట్లు, గుట్కాలు,తదితర సంబంధిత పదార్థాలను వాడటం వల్ల నోటికి క్యాన్సర్ ఊపిరితుల క్యాన్సర్ వస్తుందన్నారు, ఆడవారిలో రొమ్ము క్యాన్సర్ గర్భాశయ క్యాన్సర్ ఊపిరితుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు, పొగకు ఉత్పత్తుల వాడకం మానుకోవాలని తరచూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు, క్యాన్సర్ సోకిన వారు బరువు తగ్గడం జ్వరం రావడం దీర్ఘకాలిక మానని నోటి పుండ్లు వంటి ప్రాథమిక లక్షణాలు కనిపిస్తాయని అన్నారు, ఎన్ సి డి సి డి కార్యక్రమంలో 18,సంవత్సరాలు దాటినప్రతి ఒక్కరికి ఈనెల 14 నుంచి ఉచితంగా పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు,ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఫాత్మ ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్ విశ్వనాథ్ భీమేశ్వరి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

# సబ్సిడీ మినుము విత్తనాలను సద్విని యోగం చేసుకోండి,



**ఆత్మకూరు నవంబర్7పల్లె వెలుగు న్యూస్** మినుము పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందించడం జరుగుతుందని ఈ సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ రైతు భరోసా కేంద్రం మాజీ చైర్మన్ బైరాపురం మహబూబ్ బాషా అన్నారు, గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రైతులకు చేయూతనిస్తూ సబ్సిడీపై వినుము విత్తనాలను అందించేందుకు మంజూరు చేసిందన్నారు, స్థానిక అర్బన్ రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వాటి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు, వి బి ఎన్ -8 రకం మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు పాస్ పుస్తకాలు తీసుకెళ్లి రైతుబరుష కేంద్రంలో తీసుకోవాలని కోరారు

# ఆత్మహత్య చేసుకుని వ్యక్తి మృతి,



**ఆత్మకూరు నవంబర్ 7 పల్లె వెలుగు న్యూస్** ఇంట్లోనే ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనలో గురువారం పట్టణంలో చేసుకుంది, వివరాల్లోకి వెళితే పట్టణంలోని పాత చెక్పోస్ట్ సమీపంలో నివాసముంటున్న మహబూబ్ బాషా అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు, కుటుంబ కలహాలు అప్పుల బాధ తాళలేక ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చుట్టుపక్కల వారు తెలిపారు, విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు, పోస్టుమార్టం నిమిత్తం మృతి దేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు,

## ఈ నెల 12న అంగన్ వాడి పోస్టులకు ఇంటర్వ్యూలు :

## అదనపు సీడీపీఓ మంగావళి

**నందికొట్కూరు నవంబర్07,** ఈ నెల 12 న అంగన్ వాడి ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు అదనపు సీడీపీఓ మంగావళి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు ప్రాజెక్టు పరిధిలో ఉన్న 8 ఆయా పోస్టులకు ఈ నెల 12 న ఉదయం 10 గంటలకు ఆత్మకూరు ఆర్ డి ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు అరగంట ముందుగానే ఉండాలని, ప్రతి ఒక్కరు ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని వెళ్లాలని పేర్కొన్నారు



## సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరం



**జన్నారం, నవంబరు** సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రూ. 10,40,500 విలువ గల 50 సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పథకం వల్ల పేదలకు ఎంతో ఆర్ధిక మేలు జరుగు తుందన్నారు.

అనంతరం 13 దండారీలకు రూ. 1.95 లక్షల విలువగల చెక్కుల ను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజన సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రబుత్వం దండారీ ఉత్సవాలకు రూ.1.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ నాయకు లు రాజశేఖర్, ఇసాక్, ఇందయ్య, రమేష్, రాజన్న యాదవ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువపత్రాల జారీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



**కన్నెపల్లి, నవంబరు పల్లె వెలుగు న్యూస్:** వివిధ ధ్రువపత్రాలకు అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సర్టిఫికెట్లను త్వరగా జారీ చేయాలని సూచించారు. ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి సూచనలు చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని, అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. మండల ప్రజాపరిషత్, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## పథకాల అమలు సమర్ధవంతంగా నిర్వహించాలి




**మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు పల్లె వెలుగు న్యూస్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ సమీకృత పథకాల నిర్వహణ సమర్ధవంతంగా చేపట్టాలని దిశ చైర్మన్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, డీఆర్‌డీవో కిషన్‌లతో కలిసి దిశ (డిస్టిక్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) జిల్లా అభివృద్ధి సమన్వయ పరిరక్షణ కమిటీ త్రైమాసిక సమావేశానికి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ జాతీయ రహదారి 163లో భాగంగా ప్యాకేజీ 1లో 83 శాతంతో 31.4 కిలోమీటర్లు, ప్యాకేజీలో 2లో 9.8 కిలోమీటర్లు మొత్తం 164 ఎకరాల సేకరణ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎన్‌హెచ్ 363లో 42 కిలోమీటర్ల మంచిర్యాలలో జిల్లాలో పూర్తయి మెయిటెన్స్‌లో ఉందని, ఎన్‌హెచ్ 63లో భాగంగా 4వ దశలో 35 కిలోమీటర్లకు లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

బొక్కల గుట్ట నుంచి మంచిర్యాల వరకు ఉన్న రోడ్డును మార్చి లోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 3 బస్తీ దవాఖానాలు, వంద పల్లె దవాఖానాలు, 149 ఆరోగ్య ఉపకే ంద్రాలు, 651 ఆశా కార్యకర్తల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్నామన్నారు. నేషనల్ హెల్త్‌మిషన్ కింద సబ్ సెంటర్లు అలోకేషన్‌కు రూ. 11 కోట్లు అవసరం ఉందని తెలిపారు. అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా సదరం శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నామన్నారు. ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు పంపగా 2 పూర్తయ్యాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ఈ సీజన్‌లో 326 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 2024-25లో ఇప్పటి వరకు 93,932 మంది కూలీలకు పనులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఇందిర మహిళ శక్తిలో భాగంగా కిరాణం, సైకిల్ షాప్, మీసేవ, క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా రెండు విడతల్లో 2,216 రెండు పడక గదుల ఇండ్లను మంజూరు, ఇందులో 1,206 పూర్తి కాగా 96 ఇండ్లు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిచ్చి కుక్క స్వైర విహారం.. 25 మందికి గాయాలు.

**కుక్కల బెడద ప్రజలను వెంటాడుతున్న పట్టించుకోని అధికారులు.**

**ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన కమిషనర్ బేబీ.**

**నందికొట్కూరు నవంబర్ 07,పల్లె వెలుగు న్యూస్ :** నందికొట్కూరు లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్న ,పెద్ద, వృద్ధులు , చిన్నారులను, మహిళలను పిచ్చి కుక్క కరిచి తీవ్రంగా గాయపరిచింది. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టించుకోవాల్సిన మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే నందికొట్కూరు మున్సిపాలిటీ, మండలంలోని బిజినవేముల, 10 బొల్లవరం గ్రామాల్లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ రోడ్లపై ప్రజలను వెంటాడుతూ గాయపరుస్తున్నాయి. గురువారం ఒకే రోజు పదుల సంఖ్యలో బాధితులు ఆసుపత్రిపాలయ్యారు.





వైద్యశాలలో కుక్క కాటుకు గురైన బాధితులతో కిక్కిరిసింది. వైద్యులు డాక్టర్ రాజశేఖర్ బాధితులకు వైద్యసేవలు అందించారు.

**30 మందిని గాయపరచిన పిచ్చి కుక్కలు**

నందికొట్కూరు మున్సిపాలిటీలోని సంగయ్యపేట, వడ్డెపేట, గాంధీనగర్, శాంతి టాకీస్ ఏరియా ప్రాంతాల్లో మధ్యాహ్నం సమయంలో పిచ్చి కుక్క స్వైర వీధిలో తిరుగుతూ చిన్నారులను, మహిళలను, వృద్ధులను దాదాపు 25 మంది ని గాయపరిచింది. అంతే కాకుండా మండలంలోని బిజినవేముల, 10 బొల్లవరం గ్రామంలో 5 మంది గాయాలపాలైన బాధితులకు నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు డాక్టర్ రాజశేఖర్ వైద్యసేవలు అందించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పిచ్చికుక్కలు ఎక్కువగా ఉన్నాయని, రాత్రి సమయంలో బయటకు వెళ్లాలన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు కుక్కలను లేకుండా చేసేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ బేబీ బాధితులను వైద్యశాలకు వెళ్ళి పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందిచాలని వైద్యులు రాజశేఖర్ ను ఆదేశించారు.

## విశాఖ శారదా పీఠానికి వైసీపీ ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాలు స్వాధీనం

**అమరావతి పల్లె వెలుగు న్యూస్:** విశాఖ శారదా పీఠానికి వైసీపీ ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాలను రెవిన్యూ శాఖ స్వాధీనం చేసుకుంది. భీమిలి మండలం కొత్తవలసకు సమీపంలో రిషికొండ వద్ద 15 ఎకరాలను ఎకరా లక్ష రూపాయలకు శారదా పీఠానికి జగన్ ప్రభుత్వం కట్టపెట్టిన సంగతి తెలిసిందే. ఎకరా 15 కోట్లు విలువ చేసే భూమిని లక్ష రూపాయలకు దారాదత్తం చేయడంపై కూటమి ప్రభుత్వం దర్యాప్తు చేసింది.

**అసహనం..**

దర్యాప్తు నివేదిక అందిన తర్వాత భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవిన్యూ శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 225 కోట్ల రూపాయల విలువ చేసే భూమిని 15 లక్షలకు కట్టపెట్టడంపై ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. నిన్న భూమిని పంచనామా చేసి ఈరోజు స్వాధీనం చేసుకున్నట్లు రెవిన్యూ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సిసోడియాకి రెవిన్యూ అధికారులు సమాచారం పంపించారు.

**15 లక్షలకే..**

గత వైసీపీ ప్రభుత్వం విశాఖ పీఠాధిపతి స్వరూపానందకు విశాఖలో రూ. 225 కోట్లు విలువచేసే 15 ఎకరాలను కేవలం రూ. 15 లక్షలకు కట్టబెట్టింది. ఆ సమయంలో ధర నిర్ణయించాలని అప్పటి కలెక్టర్ ను జగన్ ప్రభుత్వం కోరగా.. రిజిస్ట్రేషన్ విలువ పరిగణలోకి తీసుకుని ఎకరాకు రూ. 1.8 కోట్లు ఇవ్వొచ్చని సిఫార్సు చేశారు. కానీ నాటి సీఎం జగన్ ఎకరాను కేవలం లక్ష రూపాయాలకే ఇచ్చేశారు. అంటే. 15 ఎకరాలను రూ. 15 లక్షలకే ఇచ్చేశారు. అప్పట్లో దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపించాయి.



**భూములు స్వాధీనం..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శారదా పీఠానికి కేటాయించిన భూములపై విచారణ చేసింది. ఈ క్రమంలోనే నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేల్చింది. గత మంత్రివర్గ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఈ భూముల కేటాయింపులను రద్దు చేయాలని తీర్మానించగా.. రెవెన్యూ శాఖ అందుకు తగినట్టుగా చర్యలు తీసుకుంది. తాజాగా, విశాఖ శారదా పీఠానికి వైసీపీ ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాలను రెవిన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## ట్రంప్ గెలుపు మేలుమలుపా?

వాస్తవం ఒక్కటే! వ్యాఖ్యానాలు ఎన్నో! అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ విజయంపై కూడా ఎన్నో వ్యాఖ్యానాలు చేయవచ్చు. ఏ విషయంపైనా అన్ని వ్యాఖ్యానాలు ఒకే స్థాయిలో ఉండవు. మౌలిక వ్యాఖ్యానం అంటూ ఒకటి ఉంటుంది. ట్రంప్ విజయంపై కూడా అటువంటి మౌలిక వ్యాఖ్యానం నిస్సందేహంగా చేయవచ్చు! దీని కోసం ట్రంప్‌కు వచ్చిన ఓట్లో, ఆయనకు పట్టం కట్టిన రాష్ట్రాల జాబితానో చూడనక్కర్లేదు. 2016 నుంచి ట్రంప్‌ది ఒకటే బాట. ఆ బాటను బట్టే ట్రంప్ విజయంపై మౌలిక వ్యాఖ్యానం చేయవచ్చు. ఆ బాట స్వభావంపై ఇప్పటికే చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవి సృష్టించే విపరిణామాల గురించి చాలా వ్యాఖ్యానాలూ వెలువడ్డాయి. ఆ బాటను అనుసరించి ముమ్ముందు మరింత ఉధృతంగా రాజకీయాలు నడిస్తే ప్రజాస్వామ్యానికి, ప్రపంచానికి మంచే జరుగుతుందని విశ్వసించలేం! అమెరికా ప్రయోజనాలనే అన్నింటా ముందు నిలబెడతామన్న ట్రంప్ నినాదాన్ని పైపైన చూస్తే అసహజంగా అనిపించదు. జాతీయవాద దృష్టితో ఆ నినాదం ఇచ్చారని సరిపెట్టుకునే పరిస్థితీ లేదు. లోతుగా చూస్తే పొంచి ఉండే ప్రమాదాలు కనపడతాయి.

ఏ నినాదం అందరికీ ఒకేలా అర్థాన్ని ఇవ్వదు. భిన్న వర్గాలు, దేశాల ప్రజలకు అది విభిన్నంగా అర్థం అవుతుంది. అసలు సిసలైన అమెరికన్లకు దేశంలో ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయనీ, అమెరికా ఉత్పత్తుల అమ్మకాలకు అన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయన్నదే ట్రంప్ నినాదం సారాంశంగా భావించొచ్చు. ట్రంప్ పదేపదే చెబుతున్నట్లుగా.. అమెరికా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు కారణం నాలుగు దశాబ్దాలుగా ఆ దేశ పాలకులు అనుసరించిన విధానాలేనని ఇటీవల చరిత్రను చూస్తే ఎవరికైనా స్పష్టమవుతుంది. అందులోనూ రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష పగ్గాలు చేపట్టిన రోనాల్డ్‌రీగన్ 1980ల్లో మొదలుపెట్టిన ఆ విధానాలలోనే అమెరికా ఇప్పుడు ఎదుర్కొంటున్న పరిస్థితికి మూలాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక విధానాలను నయానా భయాన సరళీకరించి విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేలా చేసింది అమెరికా విధానకర్తలే. చౌక శ్రమ, చౌక ముడిసరుకులు పుష్కలంగా లభ్యమయ్యే ప్రాంతాలకూ దేశాలకూ అమెరికా పరిశ్రమలు తరలిపోవటానికి ప్రోత్సాహకాలు ఇచ్చింది వారే. ఆసియా దేశాల పారిశ్రామిక ఉత్పత్తులపై ఆధారపడే విధంగా అమెరికా మార్కెట్‌ను మలిచింది వారే. ఫలితంగా పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలు పోయాయి. ఒకనాటి పారిశ్రామిక ప్రాంతాలు మ్యూజియంలు గానో, నిర్జన ప్రదేశాలుగానో మారిపోయాయి. పోయిన ఉద్యోగాలకు సమానంగా కొత్త ఉద్యోగాలు రాని మాటా నిజమే. 1990ల నుంచి బాగా ఊపందుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక దశ దాటిన తర్వాత అవసరమైన స్థాయిలో అమెరికన్ యువతకు ఉద్యోగాలను సృష్టించలేదు. ఈ రంగంలో కూడా చౌకగా లభ్యమయ్యే ఆసియా నిపుణులే ఎక్కువగా లబ్ధి పొందారు. అలా లబ్ధి పొందేలా ఆ నిపుణులను రప్పించుకున్నదీ వారే! ఇటీవల వచ్చిన కృత్రిమ మేధో సాంకేతిక పరిజ్ఞానం వల్ల కూడా ఊడిపోయే ఉద్యోగాలతో పోల్చితే సృష్టి అయ్యే ఉద్యోగాల సంఖ్య తక్కువే. కోవిడ్ అనంతరం ఐటీ రంగంలో హేమాహేమీలు అనదగిన కంపెనీలు కూడా పోటీలు పడి ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఉన్నత ఉద్యోగాలను ప్రధానంగా ఆసియావాసులు, కిందిస్థాయి ఉద్యోగాలను హిస్పానిక్‌లు దక్కించుకోవటం అమెరికాలో సహజంగా జరిగిపోయింది. దీనికి ఎవరినైనా నిందించదలిస్తే మొదటగా వేలెత్తి చూపాల్సింది అమెరికా కార్పొరేట్ సంస్థలని, అక్కడి విధానకర్తలను తప్ప వేరే దేశాలని కాదు.

ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రధానంగా మధ్యతరగతి శ్వేత జాతీయులను ఆకర్షించడమే లక్ష్యంగా చేసుకుని రాజకీయాలను మొదలుపెట్టారు. మొదటిదఫా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడేనాటికే ఆ దిశలో అడుగులు వేసి విజయం సాధించారు. శ్వేతజాతి మధ్యతరగతికి ఉద్యోగ అవకాశాలు దక్కకపోవటానికి విదేశాలే కారణమని దుమ్మెత్తిపోశారు. తన ఉత్పత్తులతో అమెరికా మార్కెట్‌ను ముంచెత్తిన చైనాతో మొదలుపెట్టిన రాజకీయయుద్ధంలో అవసరమనుకున్న చోట భారత్‌నీ లాగారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ విపరీతంగా దిగుమతి సుంకాలు విధిస్తోందని విరుచుకుపడ్డారు. తాజా ఎన్నికల్లో అయితే మంచి జీతాలుండే ఉద్యోగాలన్నిటినీ భారతీయులు కొట్టేస్తున్నారనీ ఆక్షేపించారు. వివిధ రంగాల్లో అమెరికా ఆధిపత్యం తగ్గటానికి, ఉద్యోగాల క్షీణతకు ఇతర దేశాల చర్యలే కారణమన్నట్లుగా ఆయన చేసిన ప్రచారానికి లక్ష్యం శ్వేత జాతీయులను ఆకర్షించడమే. అమెరికా జనాభాలో 60 శాతానికి కాస్త అటుఇటుగా ఉన్న శ్వేతజాతీయులను తనవైపు తిప్పుకోవటంలో మొదటిసారిలాగే రెండోసారి విజయం సాధించారు. ఆయన తాజా విజయానికి మహా వ్యాఖ్యానంగా దీన్నే చెప్పుకోవాలి. అమెరికన్ అస్తిత్వానికి ముఖ్యంగా శ్వేతజాతీయుల ఆధిపత్యానికి ముప్పు ముంచుకొస్తుందనే ఒకరకమైన భయాన్ని, ఆందోళనను కలిగించటంలో ట్రంప్ సఫలీకృతమయ్యారు. అణగారిన వర్గాలే తమ అస్తిత్వాన్ని కాపాడుకోటానికి పోరాటాలు చేస్తాయన్న సూత్రీకరణ అన్ని సందర్భాల్లోనూ నిజం కాదు! ఆధిపత్య వర్గాలను ఆధారం చేసుకుని కూడా అస్తిత్వ రాజకీయాలను నడపొచ్చు అనటానికి పదేళ్ల నుంచి అమెరికాలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం. ఏదో విధంగా జనాకర్షణే ప్రధానం అనుకుని రాజకీయాలు చేసే వారికి నిరంతరం వైరివర్గాలు కావాలి. ఆ వైరివర్గాల వల్లే సకల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పటం నిరంతరం జరగాలి. ఉద్యోగ భద్రతను, ఉద్యోగ కల్పనను తగినంత ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థ అభద్రతా సమాజాన్ని సృష్టిస్తుంది. 1990ల తర్వాత మరీ ముఖ్యంగా 2007%-%2008 ఆర్థిక సంక్షోభం తర్వాత అభద్రతా భావం అమెరికా ప్రజల జీవితాల్లోకీ చొచ్చుకు వెళ్లింది. అభద్రతాభావనలో వేగిపోయే వారి ముందు శత్రువులుగా కొన్ని దేశాలనూ, కొన్ని వర్గాలను ప్రవేశపెట్టటంలోనే జనాకర్షణ నేతల విజయం దాగివుందని చెబుతూ ప్రముఖ ఆర్థికవేత్త ప్రణబ్‌బర్ధన్ అభద్రతా ప్రపంచం పేరుతో ఒక పుస్తకాన్నే రాశారు. అన్ని చోట్లా వ్యాపిస్తున్న అభద్రతా సమాజం ప్రజాస్వామ్యంలో ఉదాత్త సంప్రదాయాలను పలచనచేసి ఉన్మత్త, నిర్హేతుక నినాదప్రాయులైన నాయకులను ఎలా సృష్టిస్తోందో కూడా ప్రణబ్ బర్ధన్ విశ్లేషించారు.

అమెరికా రాజకీయాల్లో ట్రంప్ నిర్వహిస్తోన్న పాత్రను ప్రణబ్ బర్ధన్ కోణం నుంచి చూస్తే రానున్న కాలంలో ప్రపంచం చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల్లో మార్పుని చూడటం సహజం. కానీ ట్రంప్‌ని నిశితంగా చూసిన వారెవరూ ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని భావించటం లేదు. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు. మానవహక్కుల గురించి డెమొక్రటిక్ పార్టీ సిద్ధాంతపరంగానైనా ఎంతో కొంత మాట్లాడుతుంది. రిపబ్లికన్ పార్టీకి ఈ విషయంపై డెమొక్రాట్లంతగా నోరు విప్పిన చరిత్ర లేదు. ఐరాస, ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థలపై మొదటిదఫా అధ్యక్షుడైనప్పుడే ట్రంప్ చాలా విమర్శలను ఎక్కుపెట్టారు. ఈసారి అయినా వాటిపట్ల ట్రంప్ ధోరణి మారుతుందన్న నమ్మకం లేదు. వీటన్నిటికంటే ముఖ్యమైంది వాతావరణ మార్పులపై కార్యాచరణ. అసలు వాతావరణ మార్పులే ప్రమాదకరంగా లేవనీ ప్రమాదకరమని ప్రచారం చేసే వాళ్లవి డొల్ల వాదనేనని ట్రంప్ అనేకసార్లు ఈసడించారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు తాను గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రకటించారు. పాత వైఖరికే కట్టుబడి ట్రంప్ వ్యవహరిస్తే ప్రపంచానికి వాతావరణపరంగా గడ్డుకాలం తప్పదనే అనుకోవాలి.

ఇతర దేశాల సంగతెలా ఉన్నా ట్రంప్ గెలుపుతో భారత్‌కు లాభిస్తుందనే వారి సంఖ్య తక్కువేమీ కాదు. ట్రంప్ అతి జాతీయవాదంతో ఏకీభావం ఉండొచ్చు. కానీ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నకాలంలో భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు అభద్రతతో వణికిపోయారు. చదివిన డిగ్రీకి అనుగుణంగా చేస్తున్న ఉద్యోగాల్లేవని వారిని స్వదేశానికి పంపించిన ఘటనలు చాలా ఉన్నాయి. వీసాలను, ఉద్యోగ నిబంధనలను కట్టుదిట్టంచేసి అవకాశాలను కుదించి వేస్తారన్న భయం భారతీయుల్లో ఇప్పటికీ ఉంది. ఇక చైనాను కట్టడి చేయటానికి ట్రంప్ ప్రయత్నిస్తారనీ దీంతో అక్కడ నుంచి కంపెనీలు తరలి వస్తాయనే ఆశ ఇక్కడి అధికారపార్టీకి ఉంది. యాపిల్ లాంటి దిగ్గజ కంపెనీయే భారత్‌లో ఐఫోన్ల ఉత్పత్తిని ఇబ్బడిముబ్బడిగా పెంచుతోంది. ట్రంప్ రాజకీయాలే యాపిల్ లాంటి కంపెనీల కార్యకలాపాల తరలింపునకు అసలు కారణమని చెప్పలేం. 1990ల నాటి పరిస్థితి చైనాలో లేదు. అక్కడ వేతనాలు పెరిగాయి. ముడిసరుకుల ధరలు హెచ్చాయి. కంపెనీల దృష్టి భారత్‌వైపు మళ్లటానికి ఇవి కీలకపాత్రను పోషించాయి.

ఈ పరిణామాల సంగతి ఎలా ఉన్నా... పరిపక్వత చెందిన ప్రజాస్వామ్య దేశమంటే ఒకనాడు వెంటనే గుర్తుకొచ్చేది అమెరికా. ఇటీవల కాలంలో అక్కడ కూడా జనాకర్షణ రాజకీయం విపరీతంగా పరిపక్వత పొందుతోంది! అభద్రతా భావన అక్కడి ప్రజల్లోనూ రాజ్యమేలుతోంది. నినాదప్రాయ రాజకీయాల్లో నిపుణులైన నేర్పరులే జనాభిమానాన్ని పొందుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఊహించని మలుపులు తిప్పుతున్నారు. అన్ని మలుపులూ మేలుమలుపులు కావన్నదొక్కటే ప్రస్తుతానికి నిజం!



